


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 306 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ బుధవారం 8 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :306 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA WED 8 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## కొమ్మిడి నర్సింహారెడ్డి మృతి పట్ల కేసీఆర్ విచారం

- రాజకీయాల్లో నీతి, నిజాయతీకి నర్సింహారెడ్డి నిదర్శనంగా నిలిచారన్న కేసీఆర్
- తన వందలాది ఎకరాలను పేదలకు పంచిపెట్టారని కితాబు
- తెలంగాణ సమాజానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని వ్యాఖ్య

- మిగతా 2లో

## ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు.. భారత్‌తో 200 మిలియన్ డాలర్ల డీల్

- ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు విక్రయించేందుకు భారత్ ఒప్పందం
- సుమారు రూ.1900 కోట్లతో డీల్
- ఫిలిప్పీన్స్, వియత్నాం తర్వాత బ్రహ్మోస్ కొన్న మూడో దేశం ఇండోనేషియా
- అస్త్రా క్షిపణులు, సాంకేతిక బదిలీపైనా కీలక ఒప్పందాలు
- భారత్, రష్యా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణి అభివృద్ధి

- మిగతా 2లో




## నీటి వాటా కోసం ఎంతకైనా తెగిస్తాం: భారత్‌కు పాక్ సైన్యం వార్నింగ్!

- సింధు జలాల వాటా కోసం అన్ని చర్యలు తీసుకుంటామన్న పాక్ సైన్యం
- నీటి కోసం భారత్‌తో యుద్ధానికైనా సిద్ధమంటూ బిలావల్ భుట్టో వ్యాఖ్యలు
- పహల్గాం దాడి తర్వాత సింధు ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్
- ఉగ్రవాదాన్ని ఆపనంత వరకు ఒప్పందంపై ముందడుగు లేదని కేంద్రం స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్:భారత్, పాకిస్థాన్ మధ్య చారిత్రక సింధు జలాల ఒప్పందంపై వివాదం మరింత తీవ్ర రూపం దాల్చుతోంది. ఇప్పటివరకు కేవలం రాజకీయ నాయకులకే పరిమితమైన హెచ్చరికలు, ఇప్పుడు పాక్ సైనిక నాయకత్వం నుంచి కూడా వ్యక్తమవుతున్నాయి. సింధు జలాల్లో తమకు

- మిగతా 2లో






## ‘సీఎం విజయ్ పర్యటనలను కూడా మేమే నియంత్రించాలా?’.. డీఎంకేపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- సీఎం విజయ్ కరూర్ పర్యటనపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ డీఎంకే పిటిషన్
- సీఎం పర్యటనలపై ఆంక్షలు విధించాలని విన్నపం
- సాక్షులపై సీఎం ప్రభావం చూపుతారని డీఎంకే వాదన
- రాజకీయ ప్రత్యర్థుల వ్యాఖ్యలపై ఎలా ఆదేశాలిస్తామని కోర్టు ప్రశ్న
- కరూర్ తొక్కిసలాట కేసు నేపథ్యంలో పిటిషన్

- మిగతా 2లో



## ఏపీకి పెట్టుబడుల వేట..

### కొరియాలో లోకేశ్ వరుస సమావేశాలు

- దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్ బిజీ బిజీ
- ఎల్జీ, శాంసంగ్, హ్యుందాయ్ మోబిస్ వంటి దిగ్గజ సంస్థలతో భేటీ
- కాకినాడ, విశాఖలో యూనిట్లు, ఈవీ సెమీకండక్టర్ హబ్ ఏర్పాటుకు విజ్ఞప్తి
- ఏపీని ఏఐ-కంప్యూట్ హబ్?గా మార్చాలని శాంసంగ్‌కు ప్రతిపాదన
- క్వాంటమ్ కంప్యూటింగ్‌లో ఏపీని అగ్రగామిగా నిలపడమే ధ్యేయమన్న లోకేశ్

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలు

- మిగతా 2లో




- ఏపీకి రూ.9,076 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- మొత్తం 11 ప్రాజెక్టుల ద్వారా 10,531 మందికి ఉద్యోగాలు
- రైతు కుటుంబాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న సీఎం
- పర్యాటక రంగం అభివృద్ధికి 100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు
- ఇథనాల్, సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం

వివరాలు 2లో..






## ఈ ఏడాది రాయలసీమకు ఎల్‌నినో దెబ్బ...

### మంత్రి అనిత ఉన్నతస్థాయి సమీక్ష

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. దీని కారణంగా రాష్ట్రంలోని 11 జిల్లాల్లో, ముఖ్యంగా రాయలసీమలో, సాధారణం నుంచి తీవ్రస్థాయిలో వర్షపాతం లోటు నమోదైందని అధికారులు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ)

- మిగతా 2లో

## ఏపీలో హస్తకళల పర్యాటకం.. పవన్ కల్యాణ్ కీలక ప్రకటన

- టెంపుల్ టూరిజం తరహాలో హస్తకళల పర్యాటకం అభివృద్ధి
- కళాకారుల జీవితాలపై ప్రత్యేక డాక్యుమెంటరీలు రూపొందించాలని ఆదేశం
- ఉప్పాడ చీరలు, అరటి నార వస్తువులు కొనుగోలు చేసిన పవన్
- గోదావరి పుష్కరాల్లో తోలుబొమ్మలాట ప్రదర్శనలకు ప్రత్యేక ఏర్పాట్లు

- మిగతా 2లో



## భోగాపురం విమానాశ్రయం సిద్ధం.. త్వరలో ప్రారంభం: రామ్మోహన్ నాయుడు

- భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు
- అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి
- మోదీ సమయం ఖరారు చేస్తే ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి చరిత్రకు నాంది పలుకుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఈరోజు విమానాశ్రయాన్ని

- మిగతా 2లో



## మెల్‌బోర్న్‌లో మోదీ మేనియా..

### భారత ప్రధాని ఈవెంట్‌కు రికార్డు స్థాయి ఏర్పాట్లు

- ఈ వారం ఆస్ట్రేలియాలో పర్యటించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- మెల్‌బోర్న్‌లో జరగనున్న ‘మెల్‌బోర్న్ మీట్స్ మోదీ’ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు
- ఈవెంట్‌కు 30,000 మంది వస్తారని అంచనా వేస్తున్న అధికారులు
- భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు విలువలపై ఆధారపడ్డవని చెప్పిన హైకమిషనర్
- క్రికెట్‌ను దాటి ఇతర క్రీడల్లోనూ సహకారంపై దృష్టి సారించిన ఇరు దేశాలు

- మిగతా 2లో



## గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు.. 38 మందికి మరణశిక్ష

- 11 మందికి యావజ్జీవ శిక్ష కొనసాగింపు
- 2008లో జరిగిన పేలుళ్ల ఘటన
- 56 మంది మృతి, 246 మంది గాయాలు
- బాధితులకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశం
- 49 మందిని దోషులు, 28 మందిని నిర్దోషులుగా తేల్చిన వైనం

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### 'సీఎం విజయ్ పర్యటనలను కూడా మేమే నియంత్రించాలా?'.. డీఎంకేపై సుప్రీంకోర్టు ఆగ్రహం

తమిళనాడు ప్రతిపక్ష పార్టీ డీఎంకేపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి విజయ్ పర్యటనలు, ప్రసంగాలపై ఆంక్షలు విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి సుప్రీంకోర్టును వేదికగా మార్చొద్దని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలతో డీఎంకే వెనక్కి తగ్గి తన పిటిషన్‌ను ఉపసంహరించుకుంది.కరూర్ తొక్కిసలాట కేసులో సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో ముఖ్యమంత్రి విజయ్ జులై 10న అక్కడ పర్యటించనున్నారని డీఎంకే కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. మృతుల కుటుంబాలకు ఉద్యోగ నియామక పత్రాలు, ఆర్థిక సాయం అందించే కార్యక్రమం దర్యాప్తులో ఉన్న సాక్షులపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాదించింది. అంతేకాదు టీవీకే నేత ఆదవ్ అర్జున చేసిన వ్యాఖ్యలపైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రసంగాలు, పర్యటనలపై ఆదేశాలు ఇవ్వాలని కోరింది.అయితే ఈ వాదనలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. "ముఖ్యమంత్రి ఏం చేయాలో కూడా సుప్రీంకోర్టే చెప్పాలా? ఆయన ఈ కేసులో నిందితుడు కాదు. స్వేచ్ఛగా మాట్లాడే హక్కుపైనా ఆంక్షలు కోరుతున్నారా? రాజకీయ ప్రత్యర్థుల వ్యాఖ్యలపై ఈ కోర్టు ఎలా ఆదేశాలు ఇస్తుంది?" అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో డీఎంకే తన పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు అనుమతి కోరగా కోర్టు అంగీకరించింది.గతేడాది సెప్టెంబరులో కరూర్‌లో విజయ్ ఎన్నికల ప్రచార సభ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. తొక్కిసలాటకు టీవీకే కార్యకర్తల నిర్లక్ష్యమే కారణమని డీఎంకే ఆరోపిస్తుండగా, ఇదంతా డీఎంకే రాజకీయ కుట్రేనని విజయ్, టీవీకే నేతలు ఆరోపిస్తున్నారు.

## కొమ్మిడి నర్సింహారెడ్డి మృతి పట్ల కేసీఆర్ విచారం

తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. రాజకీయాల్లో అత్యంత నిరాడంబరతకు, నీతి, నిజాయతీకి నిదర్శనంగా నిలిచిన ఒక గొప్ప ప్రజల మనిషిని మనం కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సేవలో నర్సింహారెడ్డి చేసిన అపారమైన కృషిని ఈ సందర్భంగా కేసీఆర్ ప్రత్యేకంగా స్మరించుకున్నారు.భూదానోద్యమ సమయంలో తన సొంత వందలాది ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టి నర్సింహారెడ్డి ఆదర్శంగా నిలిచారని కేసీఆర్ కొనియాడారు. 1969లో సాగిన తొలిదశ తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో చురుగ్గా పాల్గొనడమే కాకుండా... మూసీ నది పరిరక్షణ కోసం, తెలంగాణ ప్రాంతానికి గోదావరి నదీ జలాల సాధన కోసం ఆయన చివరి శ్వాస వరకు నిరంతరం కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ సమాజానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. నర్సింహారెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోవడం తీరని లోటు అని అన్నారు. ఆయన మరణంతో శోకసముద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.

### ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు.. భారత్‌తో 200 మిలియన్ డాలర్ల డీల్

రక్షణ రంగ ఎగుమ తుల్లో భారత్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఇండోనేషియాకు సుమారు 200 మిలియన్ డాలర్ల (రూ. 1,900 కోట్లు) విలువైన రెండు బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్యాటరీలను సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం ఇరు దేశాల మధ్య జరిగిన పలు కీలక రక్షణ ఒప్పందాల్లో భాగంగా ఈ డీల్ ఖరారైంది. ఈ ఒప్పందంతో బ్రహ్మోస్ క్షిపణులను కొనుగోలు చేసిన మూడో విదేశీ కస్టమర్‌గా ఇండోనేషియా నిలిచింది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ మూడు బ్యాటరీల కోసం ఒప్పందం చేసుకోగా, ఈ ఏడాదే వియత్నాం కూడా బ్రహ్మోస్ కొనుగోలుకు అంగీకరించింది. తాజా ఒప్పందంతో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ తన రక్షణ భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది.ఈ డీల్ కేవలం బ్రహ్మోస్ క్షిపణులకే పరిమితం కాలేదు. ఆస్ట్రా ఎయిర్-టు-ఎయిర్ క్షిపణి వ్యవస్థలు, కీలకమైన రక్షణ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, సముద్ర భద్రత వంటి అంశాలపై కూడా ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయి. గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఇరు దేశాల రక్షణ మంత్రుల సమావేశంలోనే ఈ ఒప్పందాలపై చర్చలు మొదలయ్యాయి.భారత్‌కు చెందిన డీఆర్‌డీవో, రష్యాకు చెందిన ఎన్పీవో మషినోస్ట్రోయెనియా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణిని అభివృద్ధి చేశాయి. ఇది భారత త్రివిధ దళాల్లోనూ సేవలందిస్తోంది. భారత్ మరో అరడజను దేశాలతో బ్రహ్మోస్ అమ్మకాలపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.సాధారణంగా ఒక బ్రహ్మోస్ బ్యాటరీలో 4 లాంచర్లు ఉంటాయి. ఒక్కో లాంచర్ పై 3 రెడీ టు ఫైర్ బ్రహ్మోస్ క్షిపణులు ఉంటాయి. ఆ లెక్కన ఒక బ్యాటరీలో మొత్తం 12 క్షిపణులు ఉంటాయి. వీటిని కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు.

## ఏపీకి పెట్టుబడుల వేట..

### కొరియాలో లోకేశ్ వరుస సమావేశాలు

- మొదటి పేజి తరువాయి

నిర్వహిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరుతున్నారు.
సియోల్‌లో ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్-జు కోహ్?తో లోకేశ్ భేటీ అయ్యారు. కాకినాడ పోర్టు సమీపంలో పాలీస్టైరిన్ తయారీ కేంద్రాన్ని, మూలపేటలో ప్రపంచస్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. అలాగే, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ గ్లోబల్ సీఈవో ల్యూ జె చెయోల్‌తో సమావేశమై... విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం హ్యుందాయ్ మోబిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ బిన్ కిమ్‌తో సమావేశమైన లోకేశ్, ఏపీలో ఈవీ సెమీకండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో భేటీ సందర్భంగా... ఏపీని డేటా సెంటర్లు, సర్వర్ తయారీకి భారతదేశపు స్థావరంగా మార్చాలని ప్రతిపాదించారు.ఈ సందర్భంగా క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 150 క్యూబిట్‌ల క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు నుంచి, దాని తయారీ వరకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఈ బిజీ షెడ్యూల్ మధ్య ఆయన ఎల్జీ సైన్స్ పార్క్ లో రోబోతో ఫొటో దిగారు.

# ఏపీకి పెట్టుబడుల వెల్లువ.. ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన 11 ప్రాజెక్టులు ఇవే!

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన 19వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ. 9,076.11 కోట్ల విలువైన 11 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 10,531 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కలగనున్నాయి.
ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రైతు కుటుంబాలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా పారిశ్రామికీకరణ జరగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తులో ఇథనాల్‌కు డిమాండ్ పెరగనున్న నేపథ్యంలో, ఆ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. దీనివల్ల మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్‌కు సంబంధించి ఒక ప్రత్యేక పాలసీని రూపొందించాలని ఆదేశించారు. పర్యాటక రంగంలో ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 100 పర్యాటక ప్రాంతాల్లో 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు' ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పోలవరం, గండికోట, లంబసింగి వంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో సోలార్ సెల్స్ తయారీలో ఏపీని అగ్రగామిగా నిలపాలని, పెండింగ్‌లో ఉన్న 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు.
ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**SIPB ఆమోదం తెలిపిన 11 ప్రాజెక్టుల వివరాలు:**

1. డీఎస్ఆర్ హాస్పిటాలిటీ: నెల్లూరులో రూ. 139.92 కోట్లతో 4-స్టార్ హోటల్ (180 మందికి ఉపాధి).
2. మాధవి లీజర్ అండ్ స్టేస్: కడపలో రూ. 52.10 కోట్లతో 3-స్టార్ హోటల్ (400 మందికి ఉపాధి).
3. శ్రీనివాసం అమ్యూజ్‌మెంట్: కడపలో రూ. 68.69 కోట్లతో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ (690 మందికి ఉపాధి).
4. వజ్ర హాస్పిటాలిటీ: విజయవాడలో రూ. 62.40 కోట్లతో హోటల్, బ్యాంక్వెట్ సెంటర్ (450 మందికి ఉపాధి).
5. నెక్సస్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్: తిరుపతి జిల్లాలో రూ. 255 కోట్లతో లాజిస్టిక్స్ పార్క్ (400 మందికి ఉపాధి).
6. అక్షత్ గ్రీన్‌టెక్: అనకాపల్లి జిల్లాలో రూ. 1,600 కోట్లతో సోలార్ సెల్, మాడ్యూల్ యూనిట్ (750 మందికి ఉపాధి).
7. బెర్రీ అలాయ్స్: బొబ్బిలిలో రూ. 1,200 కోట్లతో మాంగనీస్ సిన్టర్ ప్లాంట్ (831 మందికి ఉపాధి).
8. జియో మైసూర్ ఇండియా: కర్నూలు జిల్లా తుగ్గలిలో రూ. 689 కోట్లతో స్వర్ణగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ (1,750 మందికి ఉపాధి).
9. ఈకో బాక్స్ ఇండస్ట్రియల్స్ (గూగుల్ వేర్‌హౌస్ పార్ట్‌నర్స్): విశాఖలో రూ. 1,008 కోట్లతో లాజిస్టిక్స్ పార్క్ (5,000 మందికి ఉపాధి).
10. అదానీ ఫౌండేషన్: విశాఖ జిల్లా కపులుప్పాడలో రూ. 2,200 కోట్ల ప్రాజెక్టు.
11. మోండెలీజ్ ఇండియా ఫుడ్స్: శ్రీ సిటీలో రూ. 1,801 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ (80 మందికి ఉపాధి).

గత రెండేళ్లలో ఇప్పటివరకు 19 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించగా, మొత్తం 339 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రాష్ట్రానికి రూ. 11.86 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.41 లక్షల ఉద్యోగాలు రానున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తాజా నిర్ణయాలతో పారిశ్రామికంగా రాష్ట్రం మరింత బలోపేతం కానుంది.

## ఏపీలో హస్తకళల పర్యాటకం.. పవన్ కల్యాణ్ కీలక ప్రకటన

ఆంధ్రప్రదేశ్‌లో ఆధ్యాత్మిక, పర్యావరణ పర్యాటకం తరహాలోనే 'హస్తకళల పర్యాటకాన్ని' కూడా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. మంగళవారం విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆంధ్రప్రదేశ్ హస్తకళల ఉత్సవం 2026'ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్న కళాకారులను గుర్తించి, వారిని ప్రోత్సహించాల్సిన అవశ్యకత ఉందని పేర్కొన్నారు. కళాకారుల జీవన విధానం, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రత్యేక డాక్యుమెంటరీలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. క్లస్టర్ల వారీగా ఉమ్మడి సౌకర్య కేంద్రాలను (కామన్ ఫెసిలిటీ సెంటర్లు) ఏర్పాటు చేస్తామని, చేతివృత్తుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అలాగే, కళాకారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు.
అనంతరం, ఉత్సవం ప్రాంగణంలోని స్టాళ్లను సందర్శించిన పవన్ కల్యాణ్ కళాకారులతో ముచ్చటించారు. కాకినాడ తోలుబొమ్మలాట, ఉప్పాడ జామ్దానీ చీరలు, కలంకారీ కళాఖండాలు, తిరుపతి కొయ్యబొమ్మలు, నరసాపురం లేస్ ఉత్పత్తులతో పాటు అరటి నారతో రూపొందించిన వస్తువులను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్వయంగా కొన్ని ఉప్పాడ చీరలను, అరటి నారతో చేసిన హ్యాండ్‌బ్యాగ్‌ను కొనుగోలు చేసి కళాకారులను వ్యక్తిగతంగా అభినందించారు.
రామాయణ, మహాభారత ఘట్టాలను ప్రతిబింబిస్తూ సాగిన తోలుబొమ్మలాట ప్రదర్శన పవన్ కల్యాణ్‌ను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ప్రాచీన కళకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు, రాబోయే గోదావరి పుష్కరాల సమయంలో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ఆయన కళాకారులకు హామీ ఇచ్చారు.

## మెల్‌బోర్న్‌లో మోదీ మేనియా..

### భారత ప్రధాని ఈవెంట్‌కు రికార్డు స్థాయి ఏర్పాట్లు

ప్రధాని నరేంద్ర మోదీ ఈ వారాంతంలో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జూలై 9న జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' ప్రవాస భారతీయ కార్యక్రమానికి రికార్డు స్థాయిలో జనం హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ పర్యటనపై ఆస్ట్రేలియాలోని భారత సమాజంలో విపరీతమైన ఉత్సాహం నెలకొంది.ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియాలోని భారత హైకమిషనర్ నగేష్ సింగ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ పర్యటనకు సంబంధించిన కీలక విషయాలు వెల్లడించారు. "ప్రధాని మోదీకి ఇక్కడ విపరీతమైన ఆదరణ ఉంది. మార్వెల్ ఎరీనాలో జరిగే ఈవెంట్‌కు 25,000 నుంచి 30,000 మంది హాజరవుతారని భావిస్తున్నాం. కానీ డిమాండ్ చాలా ఎక్కువగా ఉంది. ఆస్ట్రేలియాలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. పరిమిత స్థలం కారణంగా చాలా మందికి అవకాశం కల్పించలేకపోయాం" అని ఆయన వివరించారు.కొన్నేళ్ల క్రితం సిడ్నీలో జరిగిన ఇలాంటి కార్యక్రమంలో నాటి ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్, మోదీని 'ది బాస్' అని సంబోధించిన విషయాన్ని నగేష్ సింగ్ గుర్తుచేశారు. ఈసారి మెల్‌బోర్న్ ఈవెంట్ అంతకుమించి విజయవంతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోదీతో పాటు ఆస్ట్రేలియా ప్రధాని కూడా ప్రసంగిస్తారని తెలిపారు.
భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ వంటి విలువలపై ఆధారపడ్డవని, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్‌ను ఇరు దేశాలు కోరుకుంటున్నాయని సింగ్ అన్నారు. పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రధానులు వార్షిక సదస్సులో పాల్గొంటారు. అదేవిధంగా, క్రికెట్‌ను దాటి ఇతర క్రీడల్లోనూ సహకారాన్ని విస్తరించాలని రెండు దేశాలు భావిస్తున్నట్లు తెలిపారు. క్రీడా విజ్ఞానం, సాంకేతికత, నిర్వహణ వంటి అంశాల్లో పరస్పరం సహకరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.భారత్-ఆస్ట్రేలియా ద్వైపాక్షిక సంబంధాలు చాలా బలంగా ఉన్నాయని, దానిని 'క్వాడ్' కూటమితో పోల్చడం సరికాదని నగేష్ సింగ్ స్పష్టం చేశారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారం గణనీయంగా పెరుగుతోందని, క్వాడ్ అనేది నాలుగు దేశాలతో కూడిన ప్రత్యేక ఏర్పాటు అని ఆయన వివరించారు.

## ఈ ఏడాది రాయలసీమకు ఎల్‌నినో దెబ్బ...

- మొదటి పేజి తరువాయి

ప్రధాన కార్యాలయంలో హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నైరుతి రుతుపవనాల పనితీరు, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ఈ సమావేశంలో చర్చించారు.ఎల్‌నినో కారణంగా రాయలసీమ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు సమావేశంలో గుర్తించారు. ముఖ్యంగా శ్రీ సత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో తీవ్ర వర్షాభావం ఉండగా.. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో సాధారణ లోటు నమోదైనట్లు అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో కరవు పీడిత మండలాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి అనిత అధికారులను ఆదేశించారు.మరోవైపు, విపత్తుల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.
పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ వంటి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని, పోలీస్, అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, ఏపీఎస్డీఆర్ఎఫ్ బృందాలు అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని మంత్రి అనిత దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో ఏపీఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భోగాపురం విమానాశ్రయం సిద్ధం.. త్వరలో ప్రారంభం: రామ్మోహన్ నాయుడు

- మొదటి పేజి తరువాయి

సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో జీఎంఆర్ సంస్థ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎయిరోడ్రోమ్ లైసెన్స్ వచ్చేసిందని వెల్లడించారు.
ప్రధాని మోదీ సమయం ఖరారు చేస్తే వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన టెర్మినల్ భవనం సంవత్సరానికి ఏకంగా నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా డిజైన్ చేయడంతో ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభం అయిన వారం లోపు విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను భోగాపురానికి మార్చి పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

### గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు..

## 38 మందికి మరణశిక్ష

2008లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌ను వణికించిన వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు గతంలో విధించిన 38 మంది దోషులకు మరణశిక్షను సమర్థించింది. మరో 11 మందికి జీవిత ఖైదు శిక్షను ఖరారు చేసింది. ఈ పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోగా.. 246 మంది గాయపడ్డారు. బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలని కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.
మరణించిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 5 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ. 1 లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ మొత్తం 2027 మార్చి 31లోపు చెల్లించాలని ఆదేశించింది. 2008 జులై 26న అహ్మదాబాద్‌లో పలు ప్రాంతాల్లో వరుస పేలుళ్లు జరిగాయి. రెండు రోజుల తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలపై నమోదైన 35 కేసులను కలిపి ఒకే విచారణగా చేపట్టారు.
దర్యాప్తులో వంద మందికిపైగా నిందితులను గుర్తించగా, 78 మందిపై విచారణ జరిగింది. 2022 ఫిబ్రవరిలో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి 28 మందిని నిర్దోషులుగా ప్రకటించింది. స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి) మాజీ నాయకుడు సఫ్దర్ నాగోరి కూడా దోషుల్లో ఒకడు. సిమికి చెందిన కొందరు సభ్యులు కలిసి ఇండియన్ ముజాహిదీన్ పేరుతో కొత్త సంస్థ ఏర్పాటు చేసి ఈ దాడులకు పాల్పడినట్లు పోలీసులు ఆరోపించారు. హత్య, హత్యాయత్నం, దేశంపై యుద్ధానికి యత్నం, దేశద్రోహం, ఉగ్రవాద కార్యకలాపాలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలు, పేలుడు పదార్థాల చట్టం తదితర కేసుల్లో నిందితులు దోషులుగా తేలారు.ఈ కేసు విచారణ దాదాపు పదేళ్లకు పైగా సాగింది. తొమ్మిది మంది న్యాయమూర్తుల ఎదుట 1,163 మంది సాక్షులను విచారించారు. వీరిలో 26 మంది కీలక సాక్షుల వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచారు. పేలుళ్ల తర్వాత పంపిన ఈ-మెయిళ్లలో 2002 గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు పేర్కొన్న విషయం కూడా విచారణలో ప్రస్తావనకు వచ్చింది.

### నీటి వాటా కోసం ఎంతకైనా తెగిస్తాం: భారత్‌కు పాక్ సైన్యం వార్నింగ్!

- మొదటి పేజి తరువాయి

న్యాయబద్ధంగా రావాల్సిన నీటి వాటాను దక్కించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పాకిస్థాన్ సైన్యం తీవ్రంగా హెచ్చరించింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న సంబంధాలను మరింత జఠిలం చేస్తోంది.పాక్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అధ్యక్షతన జరిగిన 276వ కోర్ కమాండర్ల ఉన్నత స్థాయి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ ప్రభుత్వ ఆదేశాలకు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సింధు జలాల్లో తమ హక్కును కాపాడుకోవడానికి కట్టుబడి ఉన్నామని సైన్యం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం లేదా మళ్లించడాన్ని 'యుద్ధ చర్య'గా పరిగణిస్తామని గత ఏడాది ఏప్రిల్ 24న పాక్ జాతీయ భద్రతా కమిటీ (ఎన్ఎస్సీ) చేసిన తీర్మానాన్ని ఈ సమావేశంలో పునరుద్ఘాటించారు. దేశ సన్నద్ధత, వృత్తి నైపుణ్యం పట్ల సమావేశం సంతృప్తి వ్యక్తం చేసింది.
మరోవైపు, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) ఛైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ కూడా భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సింధు నది జలాలను భారత్ ఒక 'ఆయుధం'గా మార్చుకోవాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నీటి హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, అవసరమైతే భారత్‌తో యుద్ధం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. సైనిక సమావేశంలో ఆఫ్ఘన్ గడ్డపై నుంచి పాక్‌లో జరుగుతున్న ఉగ్రదాడులపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. కశ్మీరీలకు తమ నైతిక, రాజకీయ మద్దతు కొనసాగుతుందని పునరుద్ఘాటించారు.గత ఏడాది పహల్గాంలో 26 మంది మృతికి కారణమైన భీకర ఉగ్రదాడి తర్వాత, దానికి ప్రతీకార చర్యగా 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్థాన్ శాశ్వతంగా, విశ్వసనీయంగా స్వస్తి పలికేంత వరకు ఈ ఒప్పందంపై ముందుకు వెళ్లేది లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. క్షేత్రస్థాయి వాస్తవాలకు విరుద్ధంగా ఒప్పందాలు ఒంటరిగా మనుగడ సాగించలేవని భారత్ స్పష్టం చేసింది.ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో 1960లో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం, తూర్పు నదులైన రావి, సట్లెజ్, బియాస్‌పై భారత్‌కు, పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్‌పై పాకిస్థాన్‌కు నియంత్రణ ఉంటుంది. ఒప్పందం నిలిచిపోవడంతో, రుతుపవనాల సమయంలో పాక్‌తో వరద సమాచారాన్ని పంచుకోవాల్సిన బాధ్యత భారత్‌కు లేకుండా పోయింది. ఇదే సమయంలో భారత్.. సింధు నదీ బేసిన్‌లో సావల్‌కోట్, రాటిల్, బుర్సార్ వంటి పలు జలవిద్యుత్ ప్రాజెక్టులను వేగవంతం చేస్తోంది. పాకిస్థాన్ వ్యవసాయంలో 80-90 శాతం సింధు నదీ వ్యవస్థపైనే ఆధారపడి ఉంది. ఆ దేశంలోని ప్రధాన జలాశయాలైన టార్బేలా, మంగ్లా డ్యామ్‌లలో నీటి నిల్వలు అడుగంటినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఒకప్పుడు సాంకేతిక ఒప్పందంగా ఉన్న సింధు జలాల అంశం ఇప్పుడు ఇరు దేశాల మధ్య కీలకమైన వ్యూహాత్మక ఒత్తిడి కేంద్రంగా మారింది.

# ఏపీఎంగా సీతా మహాలక్ష్మి



ఆలమూరు, పెన్ పవర్, జూలై 07;డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం ఏపీఎంగా ఎస్.సీతా మహాలక్ష్మి నియమితులయ్యారు. ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు మండలం నుంచి పదోన్నతిపై ఆలమూరు మండలానికి వచ్చారు. ప్రస్తుతం ఇంచార్జి ఏపీఎంగా పనిచేస్తున్న వి. సత్తిబాబు కె.గంగవరం మండలానికి బదిలీ అయ్యారు. ఈమేరకు మంగళవారం ఇంచార్జి సత్తిబాబు నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు.


**ఎంపిడిఓ రాజును కలిసిన ఏపీఎం**



ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఏ రాజును ఏపీఎం సీతా మహాలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిసారు. మండల స్థితిగతులపై చర్చించి మండలాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి విశేష కృషి చేయాలని, రుణాల మంజూరులో పారదర్శకత పాటించాలని ఈసందర్భంగా ఎంపీడీఓ రాజు ఆమెకు సూచించారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# డ్రైనేజీ పొంగిపొర్లి భక్తులకు అవస్థలు






**వాడపల్లిలో ఆలయ మార్గం జలమయం..**

**చర్యలు చేపట్టిన అధికారులు**

**పెన్ పవర్ ఆత్రేయపురం జూలై 7:**ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలోని కోనసీమ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులు డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిపై డ్రైనేజీ పొంగిపొర్లడంతో మురుగు నీరు రోడ్డంతా వ్యాపించి రాకపోకలకు ఆటంకంగా మారింది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు మురుగు నీటిలోనే నడుచుకుంటూ ఆలయానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.. ఎదురుగా ఉన్న దుర్గమ్మ గుడి వద్ద కూడా మురుగు నీరు నిల్వ ఉండటంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నిల్వ నీటిలో దోమలు విపరీతంగా పెరగడంతో స్థానికులు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన వెదజల్లుతున్న మురుగు నీటితో పరిసర ప్రాంత ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు.డ్రైనేజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని వాపోతున్నారు. వెంటనే డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేసి రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించాలని, భక్తులు ఇబ్బందులు లేకుండా ఆలయాలకు చేరుకునేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు, భక్తులు పంచాయతీ అధికారులను కోరుతున్నారు.



# గ్రామ స్వరాజ్యం అంటే ఇదేనా..?

## 18 గ్రామాల్లో కేవలం 7 పంచాయతీలకే ట్రాక్టర్లు


- ట్రైసైకిళ్లతోనే చెత్త సేకరణ
- పారిశుద్ధ్య కార్మికులపై పెరుగుతున్న పనిభారం
- గ్రామాల్లో దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు
- యంత్రాల కొరతతో నత్తనడకన చెత్త నిర్వహణ
- మిగిలిన గ్రామాలకు ట్రాక్టర్ల కేటాయింపుపై డిమాండ్

గండేపల్లి మండలంలోని చాలా గ్రామాల్లో చెత్త సేకరణకు అవసరమైన ట్రాక్టర్లు లేకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ తీవ్రంగా దెబ్బతింటోంది. ట్రైసైకిళ్లతోనే చెత్త తరలిస్తున్న సిబ్బంది తీవ్ర శ్రమ పడుతుండగా, గ్రామాల్లో దుర్వాసన, అపరిశుభ్రత ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.









**గండేపల్లి, పెన్ పవన్, జూలై 07:** "హమ్మయ్య... బ్రతుకు జీవుడా! బ్రతకాలంటే బండి తోయాల్సిందే..." అంటూ నిత్యం చెత్త ట్రైసైకిళ్లను తోస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితి గండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో కనిపిస్తోంది. రోజంతా గ్రామ వీధుల్లో చెత్తను సేకరించి, ట్రైసైకిల్‌ను నెట్టుకుంటూ డంపింగ్ ప్రాంతాలకు తరలించాల్సి రావడంతో వారు తీవ్ర శారీరక శ్రమకు గురవుతున్నారు. అలసిపోయి కాసేపు ఆగితే గ్రామాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లే పరిస్థితి నెలకొంటోంది.

గండేపల్లి మండలంలో మొత్తం 18 గ్రామపంచాయతీలు ఉండగా, వాటిలో కేవలం ఏడు గ్రామపంచాయతీలకే ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయి. గండేపల్లి, మురారి, మల్లేపల్లి, తాళ్లూరు, సూరంపాలెం, జెడ్. రాగంపేట తదితర గ్రామాల్లో మాత్రమే ట్రాక్టర్ల ద్వారా చెత్త తరలింపు జరుగుతోంది.

మండల పరిధి పి, నాయకపల్లిలో గ్రామంలోని చెత్తను ట్రై సైకిల్ పై చెత్తను వేసుకుని బతుకు జీవుడా అంటూ గ్రామానికి దూరంగా బండిని లాగుతున్న పంచాయతీ చెందిన భార్య భర్తలు పరిస్థితి దయానియంగా కనబడుతుంది.

మిగిలిన గ్రామపంచాయతీల్లో ఇప్పటికీ ట్రైసైకిళ్ల ద్వారానే చెత్తను సేకరించి తరలిస్తున్నారు. ట్రాక్టర్లు లేని గ్రామాల్లో ఒక్కో వీధి నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు చేర్చేందుకు గంటల సమయం పడుతోంది. దీంతో చెత్త సకాలంలో తొలగించలేక గ్రామాల్లో దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని చెబుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికులు కూడా తగిన వాహనాలు లేకపోవడంతో తమపై పనిభారం పెరిగిందని వాపోతున్నారు. ట్రైసైకిల్‌తో ఎక్కువ దూరం చెత్తను తరలించడం శారీరకంగా ఎంతో కష్టమవుతోందని వారు పేర్కొంటున్నారు.

ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో శిరీషను ఫోన్ ద్వారా సంప్రదించగా, మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో ఏడు గ్రామాలకు మాత్రమే ట్రాక్టర్లు ఉన్నాయని, మిగిలిన గ్రామాల్లో ట్రైసైకిళ్ల ద్వారానే చెత్త తరలింపు జరుగుతోందని తెలిపారు.

మండలంలోని అన్ని గ్రామపంచాయతీలకు చెత్త తరలింపు కోసం ట్రాక్టర్లు, అవసరమైన పారిశుద్ధ్య వాహనాలను ప్రభుత్వం తక్షణమే కేటాయించాలని గ్రామస్తులు, పారిశుద్ధ్య కార్మికులు కోరుతున్నారు. పారిశుద్ధ్య వ్యవస్థను బలోపేతం చేయకపోతే ప్రజారోగ్య సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## ప్రత్తిపాడు సబ్ రిజిస్టార్ కార్యాలయం మోకాళ్లపై నిరసన తెలిపిన దస్తావేజు లేఖర్లు.



**-తక్షణమే కూటమి ప్రభుత్వం 396 జిఓను రద్దు చేయాలి**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 7:**కాకినాడి జిల్లా ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు మోకాళ్ళపై నిరసన తెలియజేసారు.396 జీఓను తక్షణమే రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్లు మాట్లాడుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో సంస్కరణల పేరుతో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నెంబర్ 396తో తాము ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రైవేట్ రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ద్వారా జరిగే ప్రతి దస్తావేజు లావాదేవీపై రూ. 2,000 అదనపు రుసుము వసూలు చేయనున్నారన్నారు.ఇది నేరుగా సామాన్య, మధ్యతరగతి ప్రజల పై భారం పడుతుందన్నారు. తక్షణం ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచదార నాగేశ్వరరావు, అత్తి ఉమామహేశ్వరరావు, చిలకమర్తి వెంకటరమణ, మదినే వెంకన్నదొర, రాయవరపు హనుమంతరావు, పంచదార రాంబాబు, సింగిలిదేవి సత్యనారాయణ,శిడగం వెంకటరమణ, గళ్ళా మధుబాబు, మంచికంటి శ్రీనివాసభారతి, పలువురు దస్తావేజు లేఖర్లు పాల్గొన్నారు.

# ఈఏపీ సెట్ లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

**ఆలమూరు, పెన్ పవర్, జూలై 07;**ఇటీవల విడుదలైన ఈ ఏపీ సెట్ లో రాష్ట్రస్థాయిలో 349 ర్యాంకు సాధించిన గుమ్మిలేరు విద్యార్థిని పిల్లా సత్య దుర్గా ఈశ్వరి లక్ష్మి ని మంగళవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.తండ్రి పరమేష్, తల్లి పావని తో పాటు ఆమె కుటుంబ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. మండపేట విజ్ఞాన్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించి రాష్ట్రస్థాయి ర్యాంకును సాధించి గ్రామం కీర్తిని చాటిందని కొనియాడారు. ఇంజనీరింగ్ విద్యను అభ్యసించి సాఫ్ట్వేర్ రంగంలో స్థిరపడాలని తన ఆకాంక్ష అని ఈ సందర్భంగా ఈశ్వరి



తెలియజేశారు. కార్యక్రమంలో మోదుకూరు సొసైటీ అధ్యక్షులు ఈదల వీర్రాజు చౌదరి, రెడ్డి దుర్గాప్రసాద్, యాదగని సతీష్, గుణ్ణం శ్రీనివాస్, రెడ్డి వెంకటేష్, గుణ్ణం వెంకటేష్, నామాల రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవతా స్పర్శ

- కిడ్నీ బాధితుడికి రూ.20 వేల ఆర్థిక సాయం కుటుంబానికి అండగా మంత్రి



**రామచంద్రపురం/పి. గన్నవరం, పెన్ పవర్, జూలై 7:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరం గ్రామం వేమనవారిపాలెంకు చెందిన వేమన కిరణ్ కుమార్ (నాని) కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు.పి. గన్నవరంకు చెందిన తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి సంసాని పెద్దిరాజు ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్, బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స వివరాలను కుటుంబ సభ్యులతో చర్చించారు. చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి ధైర్యం చెబుతూ, వ్యక్తిగతంగా రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితుడికి అవసరమైన వైద్య సహాయం అందేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ, అవసరమైన సమయంలో స్వయంగా వెళ్లి పరామర్శించి ఆర్థిక సహాయం అందిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ సేవలను స్థానికులు ప్రశంసించారు. ఆయన మానవతా దృక్పథంతో చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దొంగ శ్రీను, గనిశెట్టి ఈశ్వర్, వేమన రామకృష్ణ, వేమన గంగాధర్, శేరు శ్రీను, వేమన శ్రీను, వేమన సత్తిబాబు, అంబటి మణికంఠ, కామాడి రామకృష్ణ, అనిశెట్టి నరేష్, యర్రంశెట్టి చిన్న తదితరులు పాల్గొన్నారు.

## మెర్లపాలెంలో ఘనంగా వీ=హూ 32వ ఆవిర్భావ దినోత్సవం

## -- పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు






**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 7:**మెర్లపాలెంలో ఎం.ఆర్.పి.ఎస్ (వీ=హూ) 32వ ఆవిర్భావ దినోత్సవం మరియు వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని మెర్లపాలెం గ్రామంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎం.ఆర్.పి.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ మాదిగ హాజరై ఎం.ఆర్.పి.ఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా కొమ్మర రాఘవ మాదిగ మాట్లాడుతూ, గత 32 సంవత్సరాలుగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎం.ఆర్.పి.ఎస్ ఉద్యమం హక్కులు, ఆత్మగౌరవం కోసం నిరంతర పోరాటం చేస్తూనే అనేక సామాజిక ఉద్యమాలకు నాయకత్వం వహించిందన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల సాధనతో పాటు వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, అమరవీరుల కుటుంబాల సంక్షేమం కోసం ఉద్యమాలు నిర్వహించి, ఆరోగ్యశ్రీ వంటి ప్రజాప్రయోజన పథకాల సాధనలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సామాజిక న్యాయం సాధన కోసం ఎం.ఆర్.పి.ఎస్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తూ ముందుకు తీసుకెళ్తామని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.పి జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం యాకోబు మాదిగ, ఎం.ఎస్.పి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాప నాగరాజు, ఎం.ఆర్.పి.ఎస్ మండల అధ్యక్షుడు లకారపు చంద్రశేఖర్, సీనియర్ నాయకులు ఆకుమర్తి యేసెబు, ముప్పిడి పండు, మాజీ సర్పంచ్ మెర్ల రాము, గుండుబోగుల రామకృష్ణ, గ్రామ మహిళలు, యువతతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు




**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 07:**ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపకులు పద్మ శ్రీ మంద కృష్ణ జన్మదిన వేడుకలు కె. పెదపూడి లో ఘనంగా నిర్వహించారు. పంచాయతీ ఎదురుగా డాక్టర్"బాబు జగ్గజీవన్ రాం విగ్రహం వద్ద పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకులు 32వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. గ్రామ అధ్యక్షులు లంక వెంకట రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీ ఎస్ మండల అధ్యక్షులు తొత్తరమూడి గోవిందు, ఎం ర్ పి ఎస్ సినీయర్ నాయకులు తవిటికి వీరాస్వామి, జోన్నాడ సత్యనారాయణ, చుట్టుగుళ్ల బాబూజీ, ఆకుమర్తి మీరా సాహెబ్, నేదునూరి చిన్న సత్యనారాయణ, తవిటికి నాగేశ్వరావు, నేదునూరి శ్రీనివాస్ ( వైస్ ప్రెసిడెంట్ ) వసర్ల చిన్న, చెట్ల రవి కుమార్, ఈతకోట నాగరాజు, చేట్ల వెంకటేష్ యార్లగడ్డ ప్రకాష్, తొత్తరముడి వసంతరావు, బండి వినయ్ ఆకుమర్తి రాజేష్, ఆకుమర్తి రామకృష్ణ, లంక శివ సుబ్రహ్మణ్యం నాందేపు రమణ, ఈతకోట రామ్ చరణ్ , ఆకుమర్తి వర్మ, నేదునూరి రవికుమార్, చుట్టుగుళ్ల సోమేష్, తదితరులు పాల్గున్నారు

# ఆదిత్య యూనివర్సిటీ లో సందడి చేసిన 'లెనిన్" సినిమా టీమ్



**గండేపల్లి, పెన్ పవర్, జూలై 07:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణం లో మంగళవారం సాయంత్రం అఖిల్ అక్కినేని నటించిన లెనిన్ సినిమా టీమ్ సభ్యులు సందడి చేశారు. లెనిన్ అనేది మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో అఖిల్ అక్కినేని ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్-డ్రామా. ఇందులో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, ఎస్.ఎస్. థమన్ సంగీతం సమకూరుస్తున్నారు. రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ చిత్రం జూలై 10, 2026న థియేటర్లలో విడుదలవుతోంది.సినిమా విశేషాలు దర్శకత్వం: మురళి కిషోర్ అబ్బూరు నటీనటులు: అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే, బ్రహ్మాజీ, మరియు శివాజీ సంగీతం: థమన్ బ్యానర్లు : అన్నపూర్ణ స్టూడియోస్, మన్యం ఎంటర్‌ప్రైజెస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ విడుదల తేదీ: జూలై 10, 2026 ఈ సినిమా పూర్తి స్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కింది. అఖిల్ అక్కినేని మునుపటి చిత్రాలకు భిన్నంగా, పూర్తి గా మాస్ మరియు రాయలసీమ యాసతో కూడిన పాత్రలో కనిపిస్తున్నారు. ప్రీ-రిలీజ్ ఈవెంట్స్ మరియు ట్రైలర్‌ల ప్రకారం, సినిమా సీమలోని రాజకీయాలు, యాక్షన్ మరియు భావోద్వేగాల మేళవింపుతో కూడిన ఒక మహాభారతం లాంటిదని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా అఖిల్ అక్కినేని విద్యార్థుల కేరింతల మధ్య మాట్లాడుతూ యువతకు, ఫ్యామిలీ ఆడియన్స్ కు నచ్చే అన్ని అంశాలు చిత్రంలో పొందుపరచడం జరిగింది అని ఎంతో ప్రేమతో కష్టపడి సినిమా చేయడం జరిగింది అన్నారు. కథానాయక భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఈ చిత్రాన్ని థియేటర్స్ లోనే చూసి ఆనందించాలని సినిమా ను ఆదరించి అఖిల్ అక్కినేని కు పెద్ద ఎత్తున విజయం అందించాలని కోరారు. తొలుత ఆదిత్యకు వచ్చిన అఖిల్ అక్కినేని కి యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్. డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి ని కలవగా సతీష్ రెడ్డి సాదర స్వాగతం పలికి శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ డా.డి. కిశోర్, జగ్గంపేట సి.ఐ. తిరుపతిరావు,గండేపల్లి ఎస్.ఐ. శివ నాగుతదితరులు పాల్గొన్నారు. గండేపల్లి,పెద్దాపురం,సామర్లకోట కు చెందిన పోలీస్ సిబ్బని బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఆశా వర్కర్లు ధర్నా, వినతి పత్రం అందజేత





**గండేపల్లి,పెన్ పవర్,జులై,07:**
ఏపీ ఆశా వర్కర్ల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు మండల కేంద్రమైన గండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశావర్కర్లు సిఐటియు అధ్వర్యంలో మంగళవారం పి హెచ్ సీ వద్ద నిరసన ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ఒక పక్క అత్యవసర సేవలు మరో పక్క బిఎల్ఓ సర్వేలు చేయమంటే రెండు ఒకేసారి ఎలా చేస్తామని ప్రశ్నించారు. ఆశా వర్కర్లను బిఎల్ఓ డ్యూటీల నుండి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31 న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసిల్దారు పద్మజా కు,వైద్యాధికారి నరేష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం**

**కాజులూరు, పెన్ పవర్, జూలై 7:** ఏపీ జేఏసీ పిలుపు మేరకు రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా, కాజులూరు మండలం గొల్లపాలెం యూనిట్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు.గొల్లపాలెం యూనిట్ అధ్యక్షుడు దేవు సదానందమూర్తి నాయకత్వంలో ప్రతినిధులు మంత్రిని కలిసి, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను తీసుకెళ్లాలని కోరారు. ముఖ్యంగా పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయడం, ఐఆర్ ప్రకటించడం, పెండింగ్ డీఏలను విడుదల చేయడం, సీనియర్ సిటిజన్లైన పెన్షనర్లకు నగదు రహిత వైద్య సదుపాయం కల్పించడం, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్ సానుకూలంగా స్పందిస్తూ, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి డి.వి.వి. చిన్నారావు, ట్రెజరర్ కె.వి. రామరాజు, సభ్యులు సుంకర వీరభద్రరావు, జి. నాగేశ్వరావు, చి. సత్తిరాజు, కె.వి. రమణయ్య, వి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా సామాగ్రి స్వాధీనం..



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 07:** ఎటువంటి అనుమతులు లేకుండా నివాస గృహల మధ్య నిల్వ ఉంచిన రూ.93,500లు విలువ చేసే బాణా సంచా సామాగ్రిని అంబాజీపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాచవరం డైలీ మార్కెట్ సమీపంలో ఉన్న మెట్లకాలనికి చెందిన గాడా ఏసుకుమార్ ఎటువంటి అనుమతులు లేకుండా బాణా సంచా తయారు చేస్తున్నాడని విశ్వసనీయ సమాచారం ద్వారా తెలిసిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు సిబ్బందితో దాడి చేసి రూ. 55,400 విలువ చేసే నల్ల మందు 120 కేజీలు, సూరేఖారం 13 కేజీలు, ఎలక్ట్రిక్ పౌడర్ 3 కేజీలు, సల్ఫర్ 10 కేజీలు, రూ. 25,199 విలువ చేసే చిన్న జువ్వలు 300, పెద్ద జువ్వలు 46, పుల్లకట్టలేని జువ్వలు 200, అవుట్లు పెద్దవి 50, చిన్న అవుట్లు 50, మిడతల దండలు 7, దీపావళి బాణా సంచ విలువ రూ. 12,910లు మొత్తం రూ. 93,500లు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ సుభాని తెలిపారు.

## కే పెదపూడి లో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 61 పుట్టిన రోజు వేడుక





**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 07:**మండలం కె పెదపూడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, మంద రాజేష్ నేదునూరి పెద్దిరాజు ఆధ్వర్యంలో కె పెదపూడి సెంటర్ లో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి నిత్య కృషివళుడు దళిత జాతి పిత మహుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 61వ పుట్టినరోజు వేడుక, ఎమ్మార్పీ ఎస్ 32 వ ఆవిర్భావ దినోత్సవం ఘనమగా నిర్వహించారు . ముందుగా కె పెదపూడి గ్రామ దేవత రాజరాజేశ్వరి రావులమ్మ తల్లి ఆలయంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా ఆయన పేరున శ్రీ రాజరాజేశ్వరి రావులమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించినారు.అనంతరం మందకృష్ణ మాదిగ పుట్టినరోజు పురస్కరించుకుని. అమలాపురం మండలం బండారులంక గ్రామంలో గల జ్యోతి లింగ అన్నదాన భోజనశాలలో వృద్ధులకు పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ. ఇరిగేషన్ రాష్ట్ర డైరెక్టర్. శిరిగినీడి వెంకటేశ్వరరావు.అంబాజీపేట పిఎ సి ఎస్ మాజీ అధ్యక్షులు గణపతి వీరరాఘవులు. అంబాజీపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుడాల ఫణి. ప్రధాన కార్యదర్శి రవణం రాము, మండల జనసేన అధ్యక్షులు దొమ్మేటి సాయి కృష్ణ. ఇరుసుమండ సొసైటీ అధ్యక్షులు సుంకర గణపతి. సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సురేష్ కుమార్. కె పెదపూడి టీడీపీ అధ్యక్షులు తిరుమనాదం హనుమంతురావు. పెచ్చెట్టి హరిబాబు. ఉందుర్తి నాగబాబు. గొల్లకోటి నరేష్, వాసర్ల చిన్న నవ్వుంద్రు వెంకటరమణ. కముజు చిరంజీవి. రాయపు రెడ్డి సత్యనారాయణ. ఉందుర్తి పరంజ్యోతి, చిక్కం పల్లం రాజు . యర్ర తేజ శరణ్. చిక్కం ఏసు, సురవరపు సురేష్, తిరుమనాదం నాయుడు . వాసర్ల సురేష్ . పలివేల సత్యనారాయణ . దొమ్మేటికి సత్తిపండు. బల్లా బసవరాజు. బలిజేపల్లి గోపాలకృష్ణ. తిరుమనాదం రాజా. దాసరి శీను. దొమ్మటి చిట్టిబాబు చోళ్లంగి గణేష్ నుటుకుర్తి సజీవ్ కూనవరాపు రాము, పెదపూడి సురేష్, గుద్దటి శీను. కుటమి నాయకులు ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి పీఎం శ్రీ లక్ష్యం.ఏ ఎం ఓ జగన్మోహన్.







**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 7:** విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి పీఎం శ్రీ లక్ష్యమని ఏ ఎం ఓ జగన్మోహన్ అన్నారు. స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పీఎం శ్రీ పథకం అమలు తీరును పరిశీలించేందుకు మంగళవారం గురుకులానికి విచ్చేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ మాట్లాడుతూ విద్యార్థినులు ఏర్పాటుచేసిన కళా ప్రదర్శనలు, అలంకరణలు, నృత్య రూపకాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. విద్యార్థినుల నైపుణ్యాలను, ప్రతిభను ఆయన అభినందించారు. పి ఎం శ్రీ పథకం ఏపీ రెసిడెన్షియల్ లో సత్ఫలితాలను ఇస్తుందన్నారు. ప్రతి అంశంలోనూ విద్యార్థులు ఇచ్చిన వివరణలు ఎంతో చక్కగా ఉన్నాయని, ఇంగ్లీషులో ఉచ్చరణ విద్యార్థినుల భాషా పటుత్వం అద్భుతం అన్నారు. ప్రతి ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలోనూ విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పీఎం శ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య అందిస్తున్నామని, విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధి లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ కె. చంద్ర శారద, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.




## జగ్గంపేట డొక్కా సీతమ్మ క్యాంటీన్ లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 7:** జగ్గంపేట పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా మంగళవారం సుమారు 500 మందికి ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా నిరుపేదలు, కూలీలు, అవసరమైన వారికి ఉచిత భోజనం అందిస్తున్నట్లు తుమ్మలపల్లి రమేష్ తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఆయన సొంత ఖర్చులతో నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు స్వయంగా భోజనం వడ్డించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తుమ్మలపల్లి రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరావు, గంధం శ్రీను, గాది నాగరాజు, అంకం ఓంకృష్ణ, తుమ్మల మనోజ్, ముత్యాల శ్రీను, గొంతెన శ్రవణ్, గండికోట బాలాజీ, డ్రిల్ మాస్టారు, గండికోట నాగేంద్ర, మహేంద్రవాడ ఈశ్వరి, కొయ్యల లక్ష్మి, రాజపు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏలేశ్వరంలో మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు.






**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 7:** మండలంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతరపు రాజు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ 61వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిధి లింగంపర్తి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. ప్రత్యేక వేదిక వద్ద కేక్ కట్ చేసి మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుక నిర్వహించారు. అలాగే ఏలేశ్వరం పట్టణంలో వేడుకలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అనంతారపు రాజు మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదిన సంబరాలను జరుపుకోవడం మన అదృష్టం అన్నారు. ఈ సందర్భంగా పేదలకు, బిక్షాటన చేసుకునే వారికి వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో అణగారిన జాతి కోసం మొదలైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఒక రెండు సంవత్సరాల్లో ఎన్నో విజయాలను ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని నిలబడింది అన్నారు. ఈరోజు వర్గీకరణ సాధించడమే కాకుండా సమాజంలో అట్టడుగున, అణగారిన అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చి ఎన్నో కార్యక్రమాలు ఎమ్మార్పీఎస్ ద్వారా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో చేసి విజయం సాధించామని, ఆ తృప్తి ఎప్పటికీ ప్రతి హృదయంలో నిలిచి ఉంటుంది అన్నారు. మాదిగ జాతికే వన్నె తెచ్చిన మహాజననేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో పెండ్యాల రాజు అన్నదాన కార్యక్రమానికి సహకరించడం పట్ల అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో కొల్లి ఏసుబాబు, ఇప్పర్తి వెంకన్న , చాలగాల మన్నియ్య, కొల్లి నాగు, బాబు జగజ్జీవన్ రావు యూత్, తుమ్మలపల్లి పండు, కొల్లి పండు ,మిరియాల రమేష్,కాకాడ దొర, వంగలపూడి చంద్రరావు , చిక్కాల విజయ్, ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు మహిళా నాయకులు పాల్గొన్నారు.

## సిఐటియు అధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 7 :** ఏపీ ఆశా వర్కర్ల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు జగ్గంపేట మండలంలోని రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశావర్కర్లు సిఐటియు అధ్వర్యంలో మంగళవారం పి హెచ్ సీ వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు సిహెచ్ మంగ, ఈ చిలకమ్మ మాట్లాడుతూ ఒక పక్క అత్యవసర సేవలు మరో పక్క బిఎల్ఓ సర్వేలు చేయమంటే రెండు ఒకేసారి ఎలా చేస్తామని ప్రశ్నించారు. ఆశా వర్కర్లను బిఎల్ఓ డ్యూటీల నుండి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31 న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## జూద స్థావరంపై పోలీసులు దాడి




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 7:** జగ్గంపేట మండలం రాజపూడి గ్రామ శివారున రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు జగ్గంపేట సిఐ బి.తిరుపతిరావుకి వచ్చిన సమాచారం మేరకు మంగళవారం జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు సిబ్బందితో దాడులు నిర్వహించారు. జూద స్థావరంపై నిర్వహించిన దాడుల్లో ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి రూ.20150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. జగ్గంపేట మండల పరిధిలో ఎక్కడైనా రహస్యంగా కోడిపందాలు, పేకాట, జూదాలు నిర్వహించినట్లయితే జగ్గంపేట సీఐ 9440796529, జగ్గంపేట ఎస్సై 9440796569 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్సై రఘునాథరావు తెలిపారు.

## కిర్లంపూడిలో ఘనంగా సత్తెమ్మ తల్లి పండుగ



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 7:** మండల కేంద్రమైన కిర్లంపూడి నుండి రాజుపాలెం వెళ్లే దారిలో ఉన్న అనిల్ టైల్స్ ఫ్యాక్టరీ వద్ద వేంచేసియున్న సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద అమ్మవారి పండుగను అనిల్ పార్కింగ్ టైల్స్ అధినేత సేనాపతి కన్నబాబు విజయ దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పండుగను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా సేనాపతి కన్నబాబు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన సత్తెమ్మ తల్లి అమ్మవారు నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించడమే కాకుండా మొక్కులు చెల్లించుకోవడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో అమ్మవారి భక్తులు, కన్నబాబు శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతే రాజు సంకల్పంతో రైతు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ - ఎమ్మెల్యే శ్రీ గిడ్డి సత్యనారాయణ





**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 07:** రైతుల కృషి వల్లే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.

మండలం, ఇరుసుమండ గ్రామంలో నిర్వహించిన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పిఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం రైతుల పట్ల అనుసరించిన విధానాలను విమర్శిస్తూ, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రైతులపై భారాన్ని మోపిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేసి,రైతే రాజ అనే సంకల్పంతో రైతు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం కల్పించిందని పేర్కొన్నారు.

రైతుల కృషి వల్లే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని పేర్కొన్న ఆయన, ప్రస్తుతం అందజేస్తున్న పట్టాదార్ పాస్ పుస్తకాలు ప్రత్యేకతను కలిగి ఉన్నాయని తెలిపారు. రైతుకు సంబంధించిన అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, రైతు ఆమోదంతోనే పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నామని అన్నారు. గతంలో పట్టాదార్ పాస్ పుస్తకాలపై కూటమి ప్రభుత్వం ఎలాంటి రాజకీయ నాయకుల ఫోటోలు లేకుండా, కేవలం రాజముద్రతోనే పాస్ పుస్తకాలను జారీ చేస్తోందని తెలిపారు.

రైతుల పట్ల కూటమి ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధత, పారదర్శకత, బాధ్యతాయుత పాలనకు ఈ కార్యక్రమం నిదర్శనమని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పుల్లేటికుర్రులో సర్ అవగాహన కార్యక్రమం



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 07;** ప్రభుత్వం సర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి అందచేసిన
దరఖాస్తులను పూర్తి చేసి బిఎల్వో లకు అందజేయాలని మాజీ ఎంపిటిసి, సామాజిక సేవకులు ఎన్.ఎస్.ఎన్. వర్మ ఇంటింటికి వెళ్ళి?ళ ప్రజలకు వివరించారు. ఓటు హక్కు విలువైనది ప్రజలకు ఓటరు సేవలు, దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించారు అదేవిధంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వారికి ముగింపు తేదీని పొడిగించవలసిందిగా విజ్ఞప్తి చేయుచున్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో, మాజీ సర్పంచ్ నూకపెయ్యి చిన్న తదితరులు పాల్గొన్నారు.

# గొల్లప్రోలులో భారీ చోరీ

- బంగారం, వెండి వస్తువులు, నగదు అపహరణ
- క్లూస్ టీంతో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

**గొల్లప్రోలు, పెన్ పవర్,జులై,07:** గొల్లప్రోలు గ్రామంలోని పాత పోస్టాఫీస్ వీధిలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ కార్యక్రమం నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లిన వృద్ధ మహిళ ఇంటిని లక్ష్యంగా చేసుకున్న గుర్తుతెలియని దుండగులు బంగారు, వెండి ఆభరణాలు, నగదు, బ్యాంకు లాకర్ తాళాలను అపహరించి పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గొల్లప్రోలు గ్రామానికి చెందిన పాశం సురేఖ (63), భర్త దివంగత వీర వెంకట సత్యనారాయణ. ఆమె పిల్లలు విదేశాల్లో స్థిరపడటంతో సొంత ఇంటిలో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఈ నెల 3వ తేదీన కుటుంబ సభ్యుల దినకార్యక్రమాల కోసం హైదరాబాద్‌కు వెళ్లారు.

ఈ నెల 6వ తేదీ సాయంత్రం సుమారు 7.30 గంటల సమయంలో ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉండటాన్ని పొరుగువారు గమనించి, ఆమె సోదరుడు గొల్లపల్లి ఉమామహేశ్వరరావుకు సమాచారం అందించారు. ఆయన అరుణాచలం పర్యటనలో ఉండటంతో మంగళవారం ఉదయం గొల్లప్రోలు చేరుకుని ఇంటిని పరిశీలించగా చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. దుండగులు ఇంటి వెనుక కిటికీ ద్వారా టవర్ బోల్ట్‌ను తొలగించి లోపలికి ప్రవేశించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అనంతరం బెడ్‌రూమ్‌లోని బీరువా తాళాలను గుర్తించి, బీరువా తెరిచి అందులో భద్రపరిచిన 8 గ్రాముల బంగారు చెవి దిద్దులు, 32 గ్రాముల బంగారు హారం, సుమారు 250 గ్రాముల వెండి వస్తువులు, కొంత నగదు, అలాగే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుకు చెందిన రెండు



లాకర్ తాళాలను అపహరించినట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనాస్థలికి క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ, నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు గొల్లప్రోలు ఎస్సై ఎన్. రామకృష్ణ తెలిపారు.

## మాన్యశ్రీ మందా కృష్ణ మాదిగ 32 జన్మదిన వేడుకలు...






**శంఖవరం పెన్ పవర్ జులై 07:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం గ్రామంలో దుర్గ కాలనీల, మాదిగ జాతి ముద్దుబిడ్డ శ్రీ మాన్యశ్రీ మందా కృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా, ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దలు మహిళలు యూత్ అందరూ కలిసి జండా ఎగరవేసి కేక్ కట్ చేసి కట్ చేసి మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశాము, మహిళ అధ్యక్షురాలు బుల్లెమ్మ మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ అనేది ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో జులై 7 1994న మంద కృష్ణ మాదిగ స్థాపించబడిన సామాజిక రాజకీయ ఉద్యమం, ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ కోసం గౌరవ మందా కృష్ణ మాదిగ అనేక రకాలైన పోరాటాలతో పాటు చిన్న పిల్లల గుండె వ్యాధిగ్రస్తుల కొరకు, వికలాంగుల వృద్ధాప్య పెన్షన్ల కొరకు, సామాజిక న్యాయం సమానత్వం కొరకు ఎన్నో పోరాటాలు చేశారు, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధకుడు, ఆయన చేసిన సేవలు గుర్తించి ఆయనకు కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారాన్ని ఇచ్చి సత్కరించిందని ఆయన అడుగుజాడల్లో ప్రతి మాదిగ బిడ్డ నడుచుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమానికి రాయి సూరిబాబు , గడ్డం నాగేశ్వరరావు రాజ శ్రీను, బడపాటి సూర్యరావు, బుల్లెమ్మ నాని నాయుడు, సుశీల , మేరి, మహిళలు ఎమ్మార్పీఎస్ యూత్ పాల్గొన్నారు.

## వాడపల్లి రహదారి విస్తరణకు కసరత్తు

- 16న రైతులతో ఆర్డీఓ సమావేశం



**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 7 :**వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. కొత్తపేట రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో మంగళ వారం ఆర్డీఓ వి.వి. సత్యనారాయణ అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

రహదారి విస్తరణకు అవసరమైన భూసేకరణ, సర్వే ప్రక్రియ, సాంకేతిక అంశాలు, సంబంధిత రైతులతో సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రహదారిని విస్తరించడం ద్వారా రాకపోకలు సులభతరం కావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, రహదారి విస్తరణకు సంబంధించి ఈ నెల 16వ తేదీన భూములు ప్రభావితమయ్యే రైతులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి అభివృద్ధి కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు.సమావేశంలో ఆర్‌జేసీ త్రినాథరావు, వాడపల్లి డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, తహసీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తి, సర్వేయర్, ఆర్ అండ్ బి శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు.



**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై 7:** కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామంలో మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.కిర్లంపూడి మండలం మాజీ జడ్పిటిసి, టిడిపి మండల ప్రెసిడెంట్ వీరంరెడ్డి కాశీబాబు ఆద్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నీటి సంఘం అధ్యక్షుడు గొంతెన బాబ్జి విచేశారు. ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్బంగా ఎమ్ ఆర్ పి యస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి మందకృష్ణ మాదిగ అన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ నోరు తీపి చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దూలపల్లి వెంకటరమణ మాదిగ, ఆరుగుళ్ళ పండు మాదిగ, బత్తిన సుమంత్ మాదిగ, మందేటి డేవిడ్ రాజు మాదిగ, మందేటి ముంగర్లయ్య మాదిగ,పాలేటి ఇజ్రాయిల్ సమక్షంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## నిరుపేదలను అన్ని విధాలా ఆదుకోవడమే తమ లక్ష్యం.

-వైసిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 7:** నిరుపేదలను అన్ని విధాలా ఆదుకోవడమే తమ లక్ష్యమని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు.ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన గొర్ల రాజబాబు భార్య బేబీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడింది.విషయం తెలుసుకున్న మురళీ కృష్ణంరాజు బేబీని పలకరించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకోవడమే కాకుండా,5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసారు.ఆ నిరుపేద కుటుంబానికి ఏ కష్టం వచ్చిన అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మండల ఉపాధ్యక్షులు కిల్లాడి బాబ్జి,కోలా తాతబాబు,కోన బాబ్జి,కేసరపు శ్రీను,గొనగాని రామకృష్ణ,నల్ల వెంకటేష్,దోమలంక బాబ్జి,పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు

## రీసర్వేలో రైతుల మధ్య వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలి

'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలి: కలెక్టర్ కె. దినేష్ కుమార్



**గంగవరం, పెన్ పవర్, జూలై 7:** పోలవరం జిల్లాలో 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న భూ రీసర్వే ప్రక్రియను రైతుల మధ్య ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

మంగళవారం గంగవరం మండలం వేములోవ గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, రంపచోడవరం ఆర్డీఓ కె. స్వాతితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీసర్వే విధానం, సిబ్బంది పనితీరు, రైతులతో సమన్వయాన్ని అధికారులు సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే చేపట్టే గ్రామాల్లో ముందుగానే రైతులకు సమాచారం అందించాలని సూచించారు. సరిహద్దుల నిర్ధారణ సమయంలో ఇరు భూయజమానులు తప్పనిసరిగా హాజరుండేలా చూడాలని, తద్వారా భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రీసర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు సర్వే సిబ్బంది ప్రతిరోజూ ఉదయం నుంచే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించాలని సూచించారు. సర్వే పూర్తయిన వెంటనే వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ సిహెచ్. శ్రీనివాసరావు, సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కుల,మతాలను రెచ్చగొడుతున్న జగన్



- బీసీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి
- తాటి నీరా ప్రాజెక్టును పరిశీలించిన రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి రవీంద్ర

**రాజమహేంద్రవరం ఎన్ పవర్ జూలై 7:**రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు, ప్రతిపక్షంలోనూ కుల,మతాలను రెచ్చగొడుతున్న జగన్

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వ లేక మాజీ సీఎం జగన్ కులమతాలను రెచ్చగొడు తున్నారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. పోలవరం జిల్లాలోని పందిరి మామిడి హార్టికల్చర్ పరిశోధన కేంద్రంలో తాటి చెట్టు నుంచి నీరా ప్రాజెక్టును మంగళవారం మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన స్థానికంగా మంజీరా హోటల్లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ , గత ప్రభుత్వ హయాంలో బీసీలపై కక్ష సాధింపు చర్యలు, ఘోరమైన హత్యలు, అక్రమ అరెస్టులు చేసిన జగన్ నేడు బీసీలపై కపట ప్రేమ వలకబోస్తున్నారని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల్లో బీసీల 33 శాతం నుంచి 24 కు తగ్గించడం జగన్ బీసీల నమ్మకద్రోహి అని విమర్శించారు. వైసిపి లోని బీసీ నాయకులు జగన్ చేసిన నేరాలపై ఎందుకు మాట్లాడలేకపోయారని విమర్శించారు. 11 సీట్లతో బుద్ధి చెప్పినప్పటికీ జగన్ తీరు మారలేదని, ఆయన దొంగ నాటకాలను ప్రజలు గమనించాలని అన్నారు. దేశాన్ని తిట్టే వారిని, వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిని జగన్ వెనకేసుకు రావడం సిగ్గు చేటు అన్నారు. బీసీల సంక్షేమం, అభివృద్ధికి...

రాష్ట్రంలో బీసీలు, గీత కులాల ఆర్థిక, సామాజిక, రాజకీయ సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బీసీలకు అన్ని రకాలుగా ప్రాధాన్యత ఆనాటి స్వర్గీయ ఎన్టీఆర్ నుంచి నేటి సీఎం చంద్రబాబు నాయుడు వరకు ఇస్తున్నారన్నారు.

కూటమి ప్రభుత్వంలో శెట్టిబలిజ ఉప కులాలకు మద్యం షాపులు, బార్ల మంజూరులో రిజర్వేషన్లు, లైసెన్సు ఫీజు ల్లో రాయితీలు, వడ్డెర కులస్తుల ఖనిజాల మంజూరుల్లో రిజర్వేషన్లు కల్పించిందన్నారు. తాటి చెట్టు నుంచి నీరా, ఇతర ఉప ఉత్పత్తుల తయారీ వల్ల గీత కులాలకు ఆర్థికంగా బలోపేతానికి ప్రభుత్వం సహకరిస్తుందని అన్నారు.1986 లోనే అనాటి ఎన్టీఆర్ నీరా తయారీకి భూమి పూజ చేశారని, దేశవ్యాప్తంగా 200 రకాల తాటి చెట్ల సంకరణం చేసి ఉత్పత్తులను వెలికి ప్రాజెక్టు ప్రాజెక్టు చేపట్టామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నీరాకు మంచి డిమాండ్ ఉందని, పోషక విలువలు ఉన్నాయని, తాటి ఉప ఉత్పత్తులకు ప్రజల ఆదరణ పొందుతాయన్నారు.

గత ఐదేళ్ల లోనూ 52 మంది గీత కార్మికులు చెట్టు పైనుండి మృతి చెందారని ఒకొక్క కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ, బీసీల అభివృద్ధికి, సంక్షేమానికి సాధికారతకు కుటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జగన్ హయంలో బీసీలపై జరిగిన అరాచకాలు, అకృత్యాలు వైసీపీలోని బీసీలకు గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ, తాటి నీరా కు ఉప ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని అన్నారు. పోలవరం జిల్లాలోని నీరా ప్రాజెక్టు విజయవంతం అయితే రాష్ట్రంలో మిగతా ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర శెట్టిబలిజ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తి బాబు, జిల్లా బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఈ సారి డిఫరెంట్ గా చంద్రబాబు

**తిరుపతి, జూలై 7 పెన్ పవర్:**
సీఎం చంద్రబాబు ప్రజలకు మరింత చేరువయ్యేలా వ్యవహరిస్తున్నారు. ఎవరో రావాలి.. ఏదో చెప్పాలి.. అని ఎదురు చూడకుండా.. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన ఆయన.. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా తనసొంత నియోజకవర్గం కుప్పంలో ప్రజలను నేరుగా కలుసుకున్నారు. వారి నుంచి అర్జీలు తీసుకున్నారు.మూడు రోజుల పర్యటన నిమిత్తం కుప్పం వచ్చిన చంద్రబాబు శనివారం నేరుగా ప్రజలతో మమేకమయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా సీఎంతో భేటీ అయ్యేందుకు వచ్చారు. అయితే.. వారిని హాల్‌లోనే కూర్చోబెట్టిన సీఎం.. అప్పటికే బయట వేచి ఉన్న ప్రజలను కలుసుకున్నారు. వారిని ఆప్యాయంగా పలకరించారు. సమస్యలు తెలుసుకున్నారు. అలానే.. స్వర్ణ కుప్పం ప్రాంత అభివృద్ధిని వారికి వివరించారు. ప్రతి ఇంటికీ సోలార్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను చెప్పారు. విద్యుత్ వినియోగంలో సౌర విద్యుత్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.ఇక, వ్యక్తిగత సమస్యలను కూడా తెలుసుకున్న చంద్రబాబు పలువురికి అక్కడికక్కడ ఆర్థిక సాయం ప్రకటించారు. కొందరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు అందించారు. ఇక, కుప్పం నియోజకవర్గంలోని గ్రామాల పరిధిలో అవలంభిస్తున్న నెట్ జీరో(వ్యర్థాల రహిత) వ్యవస్థను అడిగి తెలుసుకున్నారు. పలు ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ వ్యవస్థ గురించి తెలుసుకున్నారు. అలానే విద్యుత్ వినియోగంతో నడిచే ఇండక్షన్ కుక్కర్లు, టెర్రస్ గార్డెనింగ్ వంటి వివరాలను పలువురు చంద్రబాబుకు ద
చెప్పారు.మారుతున్న రాజకీయ వాతావరణం.. ప్రజల అభిరుచులకు అనుగుణంగా చంద్రబాబు తనను తాను మార్పు చేసు కుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా తన సొంత నియోజకవర్గంలో గతానికి భిన్నంగా ఆయన ఈ ఏడాది పలుమార్లు పర్యటించారు. ప్రతి ఒక్కరికీ చేరువ అవుతున్నారు. తద్వారా వైసీపీ వ్యూహాత్మక రాజకీయాలకు పరోక్షంగా చంద్రబాబు చెక్ పెడుతున్నారన్న వాదన వినిపిస్తోంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఉమాకు ఈ సారైనా...

**విజయవాడ, జూలై 7, పెన్ పవర్:** గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ ప్రక్రియ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తి రేపుతుండగా, ఈసారి అయినా మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావుకు అవకాశం దక్కుతుందా అనే చర్చ జోరందుకుంది. గత ఎన్నికల్లో కూటమి సమీకరణాల కారణంగా మైలవరం అసెంబ్లీ సీటును వసంత కృష్ణప్రసాద్ కోసం త్యాగం చేసిన ఉమా.. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సరైన గుర్తింపు కోసం వేచి చూస్తున్నారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకుని ఉన్న సీనియర్లకు చంద్రబాబు ఈసారి న్యాయం చేస్తారనే నమ్మకంతో ఉమా అనుచరులు ఈ గవర్నర్ కోటా రేసుపై భారీ ఆశలు పెట్టుకున్నారు.అయితే, ఈ స్థానాల భర్తీ విషయంలో చంద్రబాబు నాయుడు ముందు అనేక సమీకరణాలు ఉన్నాయి. ఇప్పటికే ఒక స్థానానికి సీనియర్ నేత వర్ల రామయ్య పేరు బలంగా వినబడుతుండగా.. మిగిలిన ఏకైక స్థానం కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. పిఠాపురం సీటును పవన్ కళ్యాణ్ కోసం వదులుకున్న ఎస్.వి.ఎస్.ఎన్. వర్మతో పాటు వంగవీటి రాధా, మహాసేన రాజేష్ వంటి నేతలు కూడా అధిష్టానం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు.రెండు స్థానాలు మాత్రమే ఖాళీగా ఉండటం వల్ల, సామాజిక మరియు ప్రాంతీయ సమతుల్యతను (ముఖ్యంగా రాయలసీమ లేదా బీసీ నేతలకు ప్రాధాన్యత) దృష్టిలో ఉంచుకుంటే ఉమాకు ఈసారి కూడా నిరాశే ఎదురవుతుందా అనే సందేహాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి దేవినేని ఉమా పేరును చంద్రబాబు పరిశీలిస్తారా, లేదా భవిష్యత్తులో రాబోయే ఇతర కోటా.. స్థానిక సంస్థలు లేదా అసెంబ్లీ ఎమ్మెల్సీ స్థానాల్లో సర్దుబాటు చేస్తారా అనేది సస్పెన్స్‌గా మారింది. పార్టీ కోసం ఏళ్ల తరబడి శ్రమించిన ఉమాకు ఈసారి పెద్దల సభలో అవకాశం కల్పిస్తే కృష్ణా జిల్లా క్యాడర్‌లో కొత్త ఉత్సాహం వస్తుందని ఆయన వర్గం భావిస్తోంది. మరికొద్ది రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రెండు స్థానాలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## విశాఖలో ట్రైయాంగిల్ పాలిటిక్స్..

**విశాఖపట్టణం, జూలై 7 పెన్ పవర్:** విశాఖ జిల్లాలో మంత్రి పదవిని ఆశిస్తున్న వారిలో సీరియస్ గా రేసులో ఉన్న వారిగా ఈ ముగ్గురు నేతల పేర్లను ప్రచారం చేస్తున్నారు. మంత్రి వర్గ విస్తరణ ఈ శ్రావణ మాసం ఉండవచ్చు అని అంటున్నారు. దాంతో ఆగస్టు నెల అంటే దగ్గరలో ఉంది కాబట్టి మంత్రి పదవుల మీద ఆశపడుతున్న వారిలో వారి వర్గీయులలో చురుకుదనం పుడుతోంది అని అంటున్నారు. ఇక విశాఖ జిల్లాకు 2024లో మంత్రి పదవి దక్కలేదు అన్నది తెలిసిందే. ఆ మాటకు వస్తే వైసీపీ కూడా 2022 తరువాత జరిపిన విస్తరణలో విశాఖ జిల్లా భీమిలీకి చెందిన అవంతి శ్రీనివాస్ ని మంత్రి పదవి నుంచి తప్పించేసి అనకాపల్లికి చెందిన గుడివాడ అమర్నాథ్ కి ఇచ్చింది. అంతే కాదు మాడుగులకు చెందిన బూడి ముత్యాలనాయుడుకు కూడా ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చింది. అలా విశాఖ జిల్లాకు గడచిన నాలుగేళ్ళుగా మంత్రి పదవి అన్నది లేకుండా పోయింది అని అంటున్నారుమరో మూడేళ్ళలో ఏపీలో సార్వత్రిక ఎన్నికలు ఉన్నాయి. దాంతో ఎన్నికల నాటికి విశాఖ జిల్లాను ముందంజలో నడిపించాల్సి ఉంది. అంతే కాదు అనేక కంపెనీల్ విశాఖ జిల్లాకు తరలి వస్తున్నాయి. వాటిని కో ఆర్డినేట్ చేసుకోవాల్సి ఉంది. ఇక రాజకీయ పరంగా చూసినా కూడా విశాఖ జిల్లా కీలకంగా మారుతోంది. జీవీఎంసీ ఏపీలోనే అత్యధిక వార్డులతో పెద్దదిగా మారబోతోంది. దానికి ఎన్నికలు కూడా జరగబోతున్నాయి. కూటమిని మళ్ళీ గెలిపించాలి అంటే విశాఖకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే అన్నది కూడా పెద్దగా వినిపిస్తోంది. దీంతో ఈసారి విశాఖ నుంచి మంత్రిని చూడబోతున్నారు అని అంటున్నారు. టీడీపీ ప్రభుత్వంలో విశాఖ నుంచి గంటా శ్రీనివాసరావు మంత్రిగా అయిదేళ్ల పాటు పనిచేశారు. జిల్లాలో పార్టీని అంతా కట్టుగా ఉంచారు, అన్ని విధాలుగా అండగా ఉన్నారు. ఆయన అనుభవం గట్టిగా చేసే రాజకీయం వ్యూహాత్మక వైఖరి అన్నీ చూసుకుంటే కూటమిలోని మూడు పార్టీల మధ్య కో ఆర్డినేషన్ తీసుకుని రావడమే కాకుండా జిల్లాలో అభివృద్ధికి కూడా కృషి చేస్తారు అని అంటున్నారు. ఆయన భీమిలీ నియోజకవర్గంలోనే ఎక్కువ కంపెనీలు వచ్చాయి. వాటి భూసేకరణ విషయంలో గంటా ఎక్కువగా చొరవ తీసుకుని భూసేకరణ సాఫీగా సాగేలా చూశారు. దాంతో ఆయన పేరు అయితే మంత్రి పదవి విషయంలో మారుమోగుతోంది అని అంటున్నారు. ఆయనకు ఇస్తేనే వైసీపీని కూడా గట్టిగా కట్టడి చేయగలరు అన్న అంచనాల మధ్య గంటా కాబోయే మంత్రి అని ఊహాగానాలు అయితే వినిపిస్తున్నాయి. ఇక ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ గా ఉన్న పల్లా శ్రీనివాసరావు సైతం లైన్ లో ఉన్నారని అంటున్నారు. ఆయన పట్ల టీడీపీ అధినాయకత్వం సుముఖంగా ఉందని చెబుతున్నారు. వివాదాలు లేని తీరు అందరినీ కలుపుకుని పోయే విధానం అన్నీ కూడా ఆయనకు మంత్రి పదవి కట్టబెడితే కలసి వస్తుందని అంటున్నారు. ఇక బలమైన యాదవ సామాజిక వర్గం విశాఖ సిటీలో ఎక్కువగా ఉన్నారు, వారికి ఇప్పటిదాకా మంత్రి పదవి ఈ ప్రాంతంలో దక్కలేదు, దాంతో పల్లాకు ఈ పదవిని ఇవ్వడం ద్వారా ఆ బలమైన వర్గం మద్దతుని నూరు శాతం అందుకోవాలన్న వ్యూహం కూడా ఉందని అంటున్నారు. ఇలా అనేక లెక్కలు అనుకూలంగా ఉండడంతో పల్లా కి మంత్రి పదవి ఇస్తారు అని అంటున్నారు. దీని మీద కూడా ఊహాగానాలు బాగా వ్యాపిస్తున్నాయిమరో విశేషం ఏంటి అంటే బీజేపీ కూడా అనూహ్యంగా రేసులోకి రావడం. బీజేపీకి రెండు మంత్రి పదవులు ఇస్తారని ప్రచారంలో ఉంది. ఏపీలో బీజేపీ గెలిచింది ఎనిమిది ఎమ్మెల్యే సీట్లు, రాయలసీమ నుంచి సత్యకుమార్ యాదవ్ కి బెర్త్ తొలి విడతలోనె ఇచ్చారు. ఇక విస్తరణలో కనుక రెండవ మంత్రి పదవి ఇస్తారు అని కచ్చితంగా వినిపిస్తున్న మాట. దాంతో. కోస్తాలో బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నా అక్కడ మంత్రులు అనేక మంది ఉన్నారు. పైగా సామాజిక ప్రాంతీయ సమీకరణలు అన్నీ చూసుకుంటే ఉత్తరాంధ్రకే ఎక్కువ చాన్స్ ఉందని అంటున్నారు. విశాఖ ఉత్తరం నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో ఆ పార్టీ సభా పక్ష నాయకుడిగా ఉన్న విష్ణు కుమార్ రాజుకు మంత్రి పదవి దక్కుతుందని ఊహాగానాలు అయితే వినిపిస్తున్నాయి. మంత్రి వర్గంలో క్షత్రియులకు చోటు లేదు కాబట్టి ఆ కోణంలో నుంచి చూసినా రాజు గారికి చాన్స్ ఉండొచ్చు అన్నది ఒక అంచనా. మొత్తానికి మిగిలిన వారు ఎంతో మంది ఆశపడుతున్నా ఈ ముగ్గురు పేర్లు విశాఖ జిల్లా నుంచి వినిపిస్తున్నాయి.

## రావణ్ లింక్ ప్రకాష్ కి చుట్టుకుంటోందా...

**ఏలూరు, జూలై 7, పెన్ పవర్:** గత రెండు మూడు రోజుల నుండి ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ తన సోషల్ మీడియా అకౌంట్స్ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై ఏ రేంజ్ లో విరుచుకుపడుతున్నారో మన కళ్లారా చూస్తూనే ఉన్నాం. మాత విద్వేషాలను రెచ్చగొట్టే 'ప్రశ్న రావణ్' ని అరెస్ట్ చేస్తే , ప్రకాష్ రాజ్ కి ప్రాణం పోయినంత పని అయ్యింది. అతని కోసం రోజుకి రెండు మూడు వీడియోలు అప్లోడ్ చేస్తూ 'జనం చూస్తున్నారు' అంటూ ఆయన మాట్లాడుతున్న మాటలపై సోషల్ మీడియా లో నెటిజెన్స్ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. తీవ్రవాదులను ప్రోత్సహిస్తూ , హిందూ దేవుళ్లపై దుర్భాషలాడుతూ , ఇష్టమొచ్చినట్టు మాట్లాడే రావణ్ కోసం ప్రకాష్ రాజ్ ఇంతలా పోరాడడం సిగ్గు చేటు అంటూ మండిపడుతున్నారు. ఇక నేడు ప్రకాష్ రాజ్ అప్లోడ్ చేసిన వీడియో అయితే జనాల్లో అనేక అనుమానాలకు భీజం పోసింది.ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ 'ఇప్పుడు పోలీసులు రావణ్ మొబైల్ ని తీసుకొని , అతని వద్ద ఉన్నటువంటి సమాచారం మొత్తాన్ని సేకరిస్తారు. అతనికి మద్దతుగా నిలబడిన ప్రతీ ఒక్కరిని ఇబ్బందులకు గురి చేస్తారు, ఇదే కదా జరిగేది' అంటూ ఒక సంచలన వ్యాఖ్య చేశారు. ఇది విన్న తర్వాత ఇన్ని రోజులు ప్రకాష్ రాజ్ బాధపడింది రావణ్ ని అరెస్ట్ చేసినందుకు కాదు , అతనితో ఈయన నడిపిన గూడూపుఠాణి మొత్తం బయటపడుతుంది అనే భయం తోనే ప్రకాష్ రాజ్ ఇంతలా ఆరాటపడుతున్నారు , వణికిపోతున్నారు అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ అంటున్నారు. రావణ్ , ప్రకాష్ రాజ్ లను నడిపిస్తున్న నెట్ వర్క్ మొత్తం ఈ రిమాండ్ రిపోర్ట్ లో బాటపడబోతుందని, ఇక వీళ్ళ ఆట ముగిసిపోయింది అంటూ సోషల్ మీడియా లో విశ్లేషకులు అంటున్నారు. ఇదంతా పక్కన పెడితే , ప్రకాష్ రాజ్ కి తమిళనాడు డీఎంకే పార్టీ తో ఎంత మంచి సాన్నిహిత్యం ఉందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.వాళ్లకు మద్దతుగా, ఆ పార్టీ నాయకులతో , ఎమ్మెల్యేలతో మంత్రులతో కలిసి ఎన్నో ప్రెస్ మీట్ లు కూడా ఇచ్చారు. ఒక ప్రెస్ మీట్ లో అయితే పత్తి ఎమ్మెల్యే తో ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ 'బాగా మాట్లాడానా ?, ఇంకా ఏమేమి మాట్లాడాలి' అని అడగడం , అందుకు సదరు నేత సూచనలు ఇవ్వడం వంటివి మన కళ్లారా చూశాము . అలాంటి పార్టీ కి చెందిన ఎమ్మెల్యే ని తమిళనాడు సీఎం విజయ్ అరెస్ట్ చేయిస్తే ప్రకాష్ రాజ్ ఇప్పటి వరకు నోరు మెదపలేదు. తన సన్నిహిత పార్టీ ఎమ్మెల్యే అరెస్ట్ అయితే ఇప్పటి వరకు స్పందించని ప్రకాష్ రాజ్ , ఒక సాధారణ యూట్యూబర్ అరెస్ట్ అయితే , ఎందుకు ఇంతలా ఉలిక్కిపడుతున్నారు?, కచ్చితంగా వీళ్లిద్దరి మధ్య ఎదో జరిగింది అంటూ సోషల్ మీడియాలో నెటిజెన్స్ అనుమానిస్తున్నారు.

# పవన్ తో ఆశా ఆశలు

**విజయవాడ జూలై 7,పెన్ పవర్:**
ఏపీ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి ప్రత్యేక స్థానం. 1988లో వంగవీటి మోహన్ రంగ చనిపోయారు. ఇప్పటికీ ఆయన పేరు రాజకీయాల్లో వినిపిస్తూనే ఉంటుంది. కాపుల ఆశాజ్యోతి గా రంగాను అభివర్ణిస్తారు. కానీ ఉమ్మడి రాష్ట్రంలో విజయవాడ వేదికగా అన్ని వర్గాల ప్రజల కోసం పనిచేశారు. అయితే ఆయన మరణానికి సంబంధించి నిందితులను గుర్తించలేకపోయాయి ప్రభుత్వాలు. కానీ రాజకీయంగా కాపుల కోసం ఆయన పేరును ప్రతి ఎన్నికల్లోను వినియోగిస్తుంటారు. తాజాగా ఆయన జయంతి జరగగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నివాళులు అర్పించారు. దీనిపై రంగ కుమార్తె ఆశా కిరణ్ స్పందించారు. పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు చెబుతూనే త్వరలో ఆయనను కలుస్తానని చెప్పుకొచ్చారు.కొద్దిరోజుల కిందట ఏపీలో రంగారాధ మిత్రమండలి పూర్వ వైభవం కోసం ఆశాకిరణ్ ఎంట్రీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు కూడా చేశారు. త్వరలో పొలిటికల్ ఎంట్రీ ఉంటుందన్న ప్రచారం కూడా జరిగింది. అయితే ఇప్పుడు తాజాగా ఆమె జనసేనలో చేరుతారని పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభం అయింది. దానికి కారణం లేకపోలేదు. రంగా జయంతి నాడు పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా నివాళులు అర్పించేసరికి కృతజ్ఞతలు చెప్పారు. త్వరలో పవన్ కళ్యాణ్ ను కలిసి రంగా ఆశయాలకు సంబంధించి కొన్ని అంశాలను చర్చిస్తానని చెప్పుకొచ్చారు. ప్రధానంగా కృష్ణాజిల్లాకు వంగవీటి మోహన్ రంగ పేరు, రంగా పుష్కర్ ఘాట్ ఏర్పాటు వంటి వాటిపై చర్చించేందుకు త్వరలో ఆమె పవన్ కళ్యాణ్ ను కలవనున్నట్లు తెలుస్తోంది. అయితే ఆమె జనసేనలో చేరిక కోసమే ఈ ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది.వంగవీటి మోహన్ రంగా మరణం అనంతరం ఆయన రాజకీయ వారసుడిగా కుమారుడు రాధాకృష్ణ పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. 2004లో కాంగ్రెస్ పార్టీ ద్వారా



అసెంబ్లీకి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తరువాత ప్రజారాజ్యం పార్టీలో చేరారు. అక్కడ నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి.. ఆ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా పని చేశారు. జగన్మోహన్ రెడ్డితో విభేదించి తెలుగుదేశం పార్టీలో చేరారు. ప్రస్తుతం ఆ పార్టీలోనే కొనసాగుతున్నారు. త్వరలో ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఖాయమన్న ప్రచారం నడుస్తోంది. ఇంతలోనే ఆశాకిరణ్ జనసేనలో చేరుతారని తెలుస్తోంది. ప్రస్తుతం కాపుల చుట్టూ వైసిపి రాజకీయం చేస్తోంది. అందుకే టిడిపిలో రాధాకృష్ణకు.. జనసేనలో ఆశా కిరణ్ కు ప్రాధాన్యం కల్పించడం ద్వారా చెక్ చెప్పాలన్నది చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆలోచనగా తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# మావిగన్ పై కేడర్ లో సందిగ్ధత

**కర్నూలు జూలై 7,పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రాజధాని అంశం మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. ఐదేళ్ల పాటు మూడు రాజధానుల నినాదంతో గందరగోళానికి తెరలేపిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. తాజాగా జూలై 2026 లో సరికొత్తగా మావిగన్ మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు కోస్తా అర్బన్ కారిడార్ అజెండాను తెరపైకి తెచ్చారు. వచ్చే ఎన్నికల్లో మావిగన్ వర్సెస్ అమరావతి అనేదే తమ పార్టీ ప్రధాన ఎన్నికల ఎజెండా అని, దీనిని మేనిఫెస్టోలో కూడా పెడతామని జగన్ స్వయంగా ప్రకటించారు. అయితే, ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. అధినేత ఇంత పెద్ద పొలిటికల్ బాంబు పేల్చినా, అనుబంధ మీడియా, సోషల్ మీడియా వింగ్ , పార్టీ సీనియర్ నేతలు దీనికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. సజ్జల రామకృష్ణారెడ్డి లాంటి ఒకరిద్దరు మినహా మిగిలిన నేతలెవరూ ఈ టాపిక్‌ను ఓ రేంజ్‌లో జనాల్లోకి తీసుకెళ్లడానికి ఉత్సాహం చూపించడం లేదు. మొదటి ప్రధాన కారణం.. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో తీవ్ర నష్టం జరుగుతుందనే భయం. గతంలో జగన్ మూడు రాజధానుల నినాదం ఎత్తుకున్నప్పుడు విశాఖపట్నానికి ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్, కర్నూలుకు జ్యుడీషియల్ క్యాపిటల్ అన్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లోని నేతలు, కేడర్ మా ప్రాంతానికి రాజధాని వస్తోంది అని గర్వంగా ప్రచారం చేసుకున్నారు. కానీ ఇప్పుడు జగన్ ప్రతిపాదిస్తున్న మావిగన్ పూర్తిగా కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోకి వస్తుంది. ఇప్పుడు గనుక వైసీపీ సోషల్ మీడియా దీనిని విపరీతంగా ప్రమోట్ చేస్తే.. మరి విశాఖ, కర్నూలు పరిస్థితి ఏంటి? ఉత్తరాంధ్ర, రాయలసీమలను జగన్ వదిలేశారా?" అని కూటమి శ్రేణులు కౌంటర్ అటాక్ చేయడం ఖాయం. ఈ రీజినల్ సెంటిమెంట్ దెబ్బతింటుందనే భయంతోనే ఆయా జిల్లాల

వైసీపీ నేతలు ఈ టాపిక్‌ను ముట్టుకోవడానికే భయపడుతున్నారు.ఇటీవల కేంద్ర పార్లమెంట్ 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ చట్టం ద్వారా అమరావతిని ఏకైక రాజధానిగా అధికారికంగా గెజెట్‌లో పొందుపరిచింది. ఇలాంటి పరిస్థితుల్లో చట్ట విరుద్ధంగా మళ్లీ కొత్త కారిడార్ల పేరుతో రాజధానిని మారుస్తామనే భ్రమలు కల్పిస్తే.. న్యాయపరంగా పార్టీ మళ్లీ డిఫెన్స్‌లో పడుతుందని వైసీపీ అంతర్గత వర్గాలు భావిస్తున్నాయి. ఒకవైపు అమరావతిలో ప్రపంచ బ్యాంకు నిధులతో పనులు పరుగులు పెడుతుంటే, సామాన్య ఓటర్లు కూడా మళ్లీ రాజధాని మార్పుల గందరగోళాన్ని కోరుకోవడం లేదు. అందుకే, సోషల్ మీడియాలో ఈ టాపిక్‌ను ఎక్కువగా కెలికితే.. నెటిజన్ల నుండి పాజిటివ్ రెస్పాన్స్ కంటే నెగటివ్ ట్రోలింగ్ ఎక్కువ వచ్చే ప్రమాదం ఉందని ఐటీ సెల్ వ్యూహాత్మకంగా సైలెంట్ అయిపోయింది.అధికార కూటమి ఈ ప్రతిపాదనను తిప్పికొడుతున్న తీరు కూడా వైసీపీని ఆత్మరక్షణలో పడేసింది. మంత్రి లోకేష్, అచ్చెన్నాయుడు వంటి నేతలు జగన్ మూడు రాజధానులు డెవలప్ చేసింది నిజమే.. కానీ అవి హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలు అంటూ ఘాటుగా కౌంటర్లు ఇస్తున్నారు. జగన్ మాట మార్చే నైజాన్ని ఎండగడుతూ.. 2014లో అమరావతికి జై కొట్టారు, 2019లో మూడు రాజధానులు అన్నారు, ఇప్పుడు 2026లో మావిగన్ అంటున్నారు.. అసలు జగన్‌కు ఒక స్థిరమైన ఆలోచన ఉందా అని టీడీపీ సోషల్ మీడియా వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వైకాపా కేడర్ నీళ్లు నములుతోంది. జగన్ మోహన్ రెడ్డి 'మావిగన్' అనే కొత్త అజెండాను ప్రకటించింది కేవలం అమరావతిలో జరుగుతున్న భారీ అభివృద్ధి, పెట్టుబడుల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి మాత్రమేనని క్షేత్రస్థాయి నేతలు భావిస్తున్నారు. పైగా, వచ్చే ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉండటంతో.. అప్పుడే ఈ నినాదాన్ని జనంలోకి తీసుకెళ్లి 'క్యాపిటల్ సెంటిమెంట్'ను పాడుచేసుకోవడం కంటే, ప్రస్తుతానికి హోల్డ్‌లో పెట్టడమే మంచిదనే అంతర్గత వ్యూహంతోనే వైసీపీ మీడియా, సోషల్ మీడియా దీనిని పెద్దగా పట్టించుకోనట్లు నటిస్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే, అధినేత విసిరిన 'మావిగన్' బాణం.. సొంత పార్టీలోనే పట్టు కోల్పోయి, కేవలం తాడేపల్లి ప్రెస్ మీట్లకే పరిమితమైపోయిందని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు.

# వైసీపీలో చీలిక ప్రకంపనలు


**విజయవాడ, జూలై 7, పెన్ పవర్:**ఏపీలో ప్రతిపక్షంగా ఉన్న వైసీపీలో చీలిక రానుందా? ఆ పార్టీ నాయకులు చీలిపోవడమో.. లేక కూటమిలోని ఓ పార్టీలో చేరిపోవడమో ఖాయంగా కనిపిస్తోందా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. నాయకుల మాటకు విలువ లేకపోవడం.. వారు చెప్పింది ఆలకించే స్థాయిలో జగన్ ఇంకా కనిపించక పోవడం.. వంటివి పెద్ద ఎత్తున చర్చకు వస్తున్నాయి. దీంతో ఇప్పుడు సీనియర్ల నుంచి జూనియర్ల వరకు తమకు అనుకూలంగా ఉన్న పార్టీలవైపు దృష్టి పెడుతున్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే.. వైసీపీ చీలిక దిశగా అడుగులు వేయడం ఖాయమని అంటున్నారు.వాస్తవానికి పార్టీల్లో భిన్నాభిప్రాయాలు ఉండడం సహజమే. కానీ, కీలకమైన ప్రజల కోణంలో చూసినప్పుడు.. నాయకుల వాదనను కూడా పార్టీలు పట్టించుకోవాలి. ఉదాహరణకు.. పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీని వెనుకేసుకు వచ్చారు. ఇలా వద్దని పార్టీ నాయకులు కోరారు. ఆమె వినిపించుకోలేదు. ఫలితంగా పార్టీ ఓడిపోవడమే కాదు.. ఇప్పుడు పార్టీ నేతలు కూడా.. ఆమెను వదిలేసి వెళ్లిపోతున్నారు. ఇక, పార్టీనే మూసేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.అదేవిధంగా తమిళనాడులో అన్నాడీఎంకే.. బీజేపీతో పొత్తు పెట్టుకోవడాన్ని ఆ పార్టీ నాయకులు సహించలేదు. కానీ, నాయకుల మాటను పళని స్వామి వినిపించుకోలేదు. ఫలితంగా గెలిచే పార్టీ కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేక పోయింది. ఇలా.. నాయకుల మాట వినిపించుకోని పార్టీలు దేశంలో చీలిపోతున్నాయి. చిందరవందరగా కూడా మారుతున్నాయి. ఈ నేపథ్యంలోనే వైసీపీలోనూ చీలిక దిశగా అడుగులు పడుతున్నాయన్న చర్చ జరుగుతోంది. గతంలో మూడు రాజధానులు సహా.. ప్రస్తుత మావిగన్ ప్రతిపాదన వంటివి వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికల సమయంలో ఎవరికి టికెట్ ఇస్తారో.. ఎవరిని మారుస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అలానే.. తమకు ఏమాత్రం వాల్యూ లేకుండా చేస్తున్నారని సీనియర్లు వాపోతున్నారు. ఈ పరిణామాల క్రమంలోనే నాయకులు పక్క చూపులు చూస్తున్నారు.ఇక, కూటమి పార్టీల్లో బలోతపేతం కావాలని భావిస్తున్న.. బీజేపీ వీరిని చేర్చుకునేందుకు రెడీగా ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇలాంటి సమయం కోసం.. బీజేపీ ఎదురు చూస్తున్న పరిస్థితి దేశవ్యాప్తంగా కూడా కనిపిస్తోంది. ఈ క్రమంలో వైసీపీ నుంచి వచ్చేవారికి బీజేపీ ఎర్రతివాచీ పరిచినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. ఇక, వ్యక్తిగతంగా నాయకులకు ఎలానూ బలం ఉంటుంది. సో.. అలాంటి వారు ఇక, జగన్‌పై తిరుగుబాటు చేయడం ఖాయమన్న సంకేతాలు వస్తున్నాయి. వచ్చే వారం పదిరోజుల్లో ఏదైనా జరగొచ్చని.. వైసీపీకి చెందిన నాయకుడు ఒకరు నర్మగర్భ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# రీమేక్‌లకు దూరంగా ఉన్న టాలీవుడ్ స్టార్లు

టాలీవుడ్‌లో రీమేక్ సినిమాలకు ఎప్పటినుంచో ప్రత్యేక స్థానం ఉంది. ఒక భాషలో సూపర్ హిట్ అయిన కథలను మరో భాష ప్రేక్షకులకు అందించేందుకు పలువురు స్టార్ హీరోలు రీమేక్‌లను ఎంచుకున్నారు. అయితే అదే సమయంలో కొందరు అగ్ర హీరోలు మాత్రం తమ కెరీర్ మొత్తం ఒరిజినల్ కథలపైనే నమ్మకం ఉంచుతూ ప్రత్యేక గుర్తింపును సంపాదించారు. ఇప్పటివరకు ఒక్క రీమేక్ సినిమాలో కూడా నటించకుండా తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్న హీరోలు కూడా కొందరున్నారు.



సూపర్ స్టార్ మహేష్ బాబు దాదాపు 25 ఏళ్లకు పైగా సినీ కెరీర్ లో ఒక్క రీమేక్ సినిమా కూడా చేయలేదు. ఒక్కడు నుంచి పోకిరి, దూకుడు, శ్రీమంతుడు, భరత్ అనే నేను, సర్కారు వారి పాట, గుంటూరు కారం వరకు ఆయన చేసిన




సినిమాలన్నీ ఒరిజినల్ కథలే. కథల ఎంపికలో కొత్తదనం, డైరెక్టర్ల విజన్‌పై నమ్మకం ఉంచడం మహేష్ స్పెషాలిటీగా భావిస్తారు.

ఇక ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కూడా దాదాపు రెండు దశాబ్దాల కెరీర్‌లో రీమేక్‌లకు దూరంగానే ఉన్నారు. ఆర్య, దేశముదురు, జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, అల వైకుంఠపురములో, పుష్ప వంటి సినిమాలన్నీ ఒరిజినల్ కాన్సెప్ట్‌లతోనే తెరకెక్కాయి. కథలో వైవిధ్యం, పాత్రల్లో కొత్తదనం ఉండేలా చూసుకోవడం బన్నీ కెరీర్‌లో ప్రధాన బలంగా నిలిచింది. ఇక టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండ కూడా తన 15 ఏళ్ల సినీ కెరీర్ లో ఇప్పటివరకు రీమేక్‌లకు అవకాశం ఇవ్వలేదు. పెళ్లిచూపులు, అర్జున్ రెడ్డి, గీత గోవిందం, ట్యాక్సీవాలా, ఖుషి వంటి సినిమాలన్నీ ఒరిజినల్ కథలతోనే ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. యూత్ ను ఆకట్టుకునే కొత్త కాన్సెప్ట్‌లను ఎంచుకోవడంలో విజయ్ ప్రత్యేక శైలిని కొనసాగిస్తున్నారు. అయితే ఎవరైనా సరే రీమేక్‌లు చేయడం తప్పు కాదు. చాలా మంది హీరోలు ఆ రీమేక్స్ తో సక్సెస్‌లు కూడా అందుకున్నారు. కానీ మహేష్ బాబు, అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ మాత్రం ఒరిజినల్ కథలతోనే తమ బ్రాండ్‌ను నిర్మించుకోవడం విశేషం. మారుతున్న ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా కొత్త కథలకు ప్రాధాన్యం ఇస్తూ తమ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్న ఈ హీరోలు, కథ ఎంపికలో తమదైన ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తున్నారు.



## ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌లో ధోనీ క్రేజ్.. FIFA స్పెషల్ పోస్ట్ వైరల్!




భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ 45వ పుట్టినరోజు (జూలై 7, 2026) సందర్భంగా సోషల్ మీడియాలో ఒక రేంజ్ సెలబ్రేషన్స్ జరుగుతుంటే, అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమైక్య ఇచ్చిన ఒక క్రేజీ ట్రిబ్యూట్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో ఎప్పుడూ ట్రెండ్ అయ్యే "తలా ఫర్ ఎ రీజన్" అనే వైరల్ మీమ్‌ను వాడుకుంటూ ఫిఫా తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాని షేక్ చేస్తోంది. ఈ పోస్ట్‌లో ప్రపంచ ఫుట్‌బాల్ సూపర్ స్టార్స్ లియోనెల్ మెస్సి, కిలియన్ ఎంబప్పే, ఎర్లింగ్ హాలాండ్‌ల ఫొటోలను షేర్ చేస్తూ ధోనీకి బర్త్‌డే విషెస్ చెప్పింది ఫిఫా. ఫుట్‌బాల్‌కు, క్రికెట్‌కు ఫిఫా కుదిర్చిన ఈ క్రియేటివ్ కనెక్షన్‌ను చూసి ఫ్యాన్స్ ఫిదా అయ్యారు.

**నంబర్ 7 కనెక్షన్:**

మహేంద్ర సింగ్ ధోనీకి, 7 నంబర్‌కు ఉన్న బంధం ప్రత్యేకమైనది. ఆయన పుట్టింది ఏడో నెల (జూలై) ఏడో తేదీన.. అంతేకాదు తన కెరీర్ అంతటా ధోనీ ధరించిన జెర్సీ నంబర్ కూడా 7.. అందుకే సోషల్ మీడియాలో ఎక్కడ ఏ 7 నంబర్ కనిపించినా, దానికి ఎలాంటి సంబంధం లేకపోయినా మన నెటిజన్లు "తలా ఫర్ ఎ రీజన్" అంటూ ధోనీ పేరును ట్రెండ్ చేయడం అలవాటుగా మారిపోయింది. ప్రస్తుతం జరుగుతున్న ఫిఫా వరల్డ్ కప్ లో గోల్డెన్ బూట్ రేసులో ఉన్న 3 టాప్ ప్లేయర్స్ లియోనెల్ మెస్సి, కిలియన్ ఎంబప్పే, ఎర్లింగ్ హాలాండ్‌లు ప్రస్తుతం చెరో 7 గోల్స్ చేసి సమంగా ఉన్నారు. ఈ ముగ్గురి గోల్స్ సంఖ్య '7' కావడంతో.. ఫిఫా కూడా ఇండియన్ ఫ్యాన్స్ స్టైల్‌లోనే ఆ 7 నంబర్‌ను ధోనీ బర్త్‌డేకు లింక్ చేస్తూ అదిరిపోయే పోస్ట్ పెట్టింది.

**రేసులో ముందుకు దూసుకెళ్లే ఛాన్స్ ఎవరికి?**

ఈ పోస్ట్ ధోనీ బర్త్‌డేని సెలబ్రేట్ చేయడమే కాకుండా, ప్రస్తుత వరల్డ్ కప్‌లో గోల్డెన్ బూట్ రేసు ఎంత రసవత్తరంగా కొనసాగుతుందో కూడా గుర్తు చేసింది. ఈరోజు (మంగళవారం, జూలై 7 IST) అట్లాంటా వేదికగా జరగనున్న రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో అర్జెంటీనా జట్టు ఈజిప్టుతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో లియోనెల్ మెస్సి కనుక మరిన్ని గోల్స్ చేస్తే, మిగిలిన ఇద్దరి కంటే ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

**గ్లోబల్ లెవెల్‌లో ధోనీ క్రేజ్:**

చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో ఉన్న సుదీర్ఘ అనుబంధం వల్ల తమిళంలో 'నాయకుడు' అని అర్థం వచ్చేలా అభిమానులు ధోనీని "తలా" అని పిలుచుకుంటారు. ఈ రోజు ఆ పేరు కేవలం ఇండియాలోనే కాదు, గ్లోబల్ లెవెల్‌లో ఫిఫా వరల్డ్ కప్ వేదికగా మార్మోగిపోతుండటం చూసి క్రికెట్ ఫ్యాన్స్ కాలర్ ఎగరేస్తున్నారు.

## సంజు శాంసన్‌కి ఎందుకు ఛాన్స్ ఇవ్వలేదో తెలుసా?.. అసలు ట్విస్ట్ ఇదే!





జింబాబ్వే టూర్‌కు ప్రకటించిన టీమిండియా స్క్వాడ్‌లో వరల్డ్ కప్ హీరో సంజూ శాంసన్ పేరు లేకపోవడంపై సోషల్ మీడియాలో పెద్ద చర్చ జరుగుతోంది. అయితే, సంజూను జట్టు నుంచి తప్పించలేదని, ఇదంతా పక్కా స్ట్రాటజీలో భాగంగా అతనికి ఇచ్చిన రెస్ట్ మాత్రమేనని క్రికెట్ వర్గాల ద్వారా తెలుస్తోంది. బీసీసీఐ సెలెక్షన్ కమిటీ సంజూను పక్కన పెట్టడం వెనక ఉన్న అసలు కారణాలను వెల్లడించింది.

**ఆసియా క్రీడల కోసమే ఈ ప్లాన్:**

సెప్టెంబర్‌లో జరగబోయే ఆసియా క్రీడల భారత జట్టులో సంజు శాంసన్ సభ్యుడిగా ఉన్నాడు. జింబాబ్వే సిరీస్ చిన్నది కావడం, పైగా అక్కడ అతనికి తుది జట్టులో ఆడే ఛాన్స్ రాకపోవచ్చనే ఉద్దేశంతోనే సెలెక్టర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒక సీనియర్ ప్లేయర్‌ను మ్యాచ్‌లు ఆడించకుండా కేవలం బెంచ్‌పై కూర్చోబెట్టడం కంటే అతనికి రెస్ట్ ఇచ్చి యువ ఆటగాళ్లను పరీక్షించడం మంచిదని సెలక్షన్ కమిటీ భావించింది.

**ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌కు ఛాన్స్ ఇవ్వడం కోసం!**

ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించిన యువ వికెట్ కీపర్ బ్యాటర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌కు ఈ సిరీస్ ద్వారా తగినన్ని అవకాశాలు ఇవ్వాలని భారత సెలెక్టర్లు నిర్ణయించారు. ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ తరఫున ఆడిన ప్రభ్‌సిమ్రాన్ సింగ్ 168.87 స్ట్రైక్ రేట్‌తో 510 రన్స్ చేసి ఆ జట్టు టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ప్రస్తుతం జింబాబ్వే టూర్‌కు ఎంపికైన టాప్ ఆర్డర్ బ్యాటర్లలో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్.. వీరంతా ఎడమచేతి వాటం బ్యాటర్లే.. కాబట్టి టాప్ ఆర్డర్‌లో ఒక సాలిడ్ రైట్ హ్యాండ్ బ్యాటర్ ఉంటే బాగుంటుందనే ఉద్దేశంతో ప్రభ్‌సిమ్రాన్‌ను జట్టులోకి తీసుకున్నారు.

**సంజూ ఫామ్‌లో లేకపోవడం కూడా ఒక కారణమే:**

సంజూ శాంసన్‌ను పక్కన పెట్టడానికి అతని ఫామ్ లేమి ప్రధాన కారణం కాదని బీసీసీఐ రిపోర్ట్ చెబుతున్నప్పటికీ, ఇటీవల అతను వరుసగా విఫలం కావడం కూడా మైనస్ అయింది. ఐపీఎల్‌లో రెండు సెంచరీలు కొట్టినప్పటికీ, కొన్ని మ్యాచ్‌ల్లో సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యాడు. ఆ తర్వాత ఐర్లాండ్ సిరీస్‌లో 0, 5 రన్స్.. ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి టీ20లో కేవలం 1 రన్ మాత్రమే చేశాడు. ఈ మూడు మ్యాచుల్లో వైఫల్యాల వల్లే రెండో టీ20లో అతని స్థానంలో 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీకి డెబ్యూ ఛాన్స్ ఇచ్చారు.

## నా పేరుతో పిచ్చి పిచ్చి పోస్టులా.. వైరల్ కోసం ఏదైనా చేస్తారా?.. సూర్యకుమార్ ఫుల్ ఫైర్!



భారత క్రికెట్‌లో గత కొన్ని రోజులుగా కెప్టెన్సీ మార్పుల అంశం హాట్ టాపిక్‌గా నడుస్తోంది. మొన్నటి వరకు టీ20 జట్టుకు కెప్టెన్‌గా ఉన్న సూర్యకుమార్ యాదవ్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించి, సారథ్యం మొత్తాన్ని శ్రేయస్ అయ్యర్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ మార్పులపై సూర్య అసంతృప్తిగా ఉన్నాడని, టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఏకిపారేస్తూ ఒక స్టేట్‌మెంట్ ఇచ్చాడంటూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ తెగ వైరల్ అయింది. ఇక ఈ వివాదంపై క్లారిటీ ఇచ్చాడు సూర్యకుమార్. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆ వైరల్ ప్రకటనతో తనకు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పాడు. అలాంటి ఫేక్ వార్తలను అస్సలు నమ్మొద్దని ఫ్యాన్స్‌కు సూచించాడు.

**ఇన్ స్టా వేదికగా సూర్య ఫైర్:**

ప్రస్తుతం ఉన్న జట్టు కూర్పు పట్ల నేను చాలా సంతోషంగా ఉన్నాను అని సూర్యకుమార్ యాదవ్ తెలిపారు. టీమిండియాకు ఎప్పుడూ మంచి జరగాలనే కోరుకుంటాను.. కుర్రాళ్లు జట్టులో చాలా అద్భుతంగా రాణిస్తున్నారు.. వారికి నా సపోర్ట్ ఎల్లప్పుడూ ఉంటుంది. ముఖ్యంగా 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ.. నీ క్రికెట్ ప్రయాణం ఇప్పుడే మొదలైంది, ప్రతి క్షణాన్ని ఎంజాయ్ చేస్తూ దేశం గర్వపడేలా చేయాలని పేర్కొన్నాడు. ఇకపోతే సోషల్ మీడియాలో నా పేరుతో వైరల్ అవుతున్న పోస్ట్ ఒకటి నా దృష్టికి వచ్చింది.. అదంతా ఫేక్! ఆ నకిలీ వార్తలను నాకు ఆపాదిస్తున్నారు, ఆ కామెంట్స్ నేను చేయలేదు.. దయచేసి ఇలాంటి అబద్ధపు ప్రచారాలను నమ్మకండి.. భారత క్రికెట్‌కు, నా సహచర ఆటగాళ్లకు నా మద్దతు ఎప్పటికీ ఉంటుందని సూర్య భాయ్ వెల్లడించాడు.

**జట్టుకు ఎప్పటికీ నా సపోర్ట్:**

సూర్యకుమార్ యాదవ్ ఇచ్చిన ఈ క్లారిటీతో సోషల్ మీడియాలో జరుగుతున్న కెప్టెన్సీ వివాదానికి ఒక్కసారిగా బ్రేక్ పడింది. టీమ్ మేనేజ్‌మెంట్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని, కొత్తగా జట్టులోకి వచ్చే కుర్రాళ్లకు తన ఫుల్ సపోర్ట్ ఉంటుందని చెప్పడంతో సూర్య తన క్రీడా స్ఫూర్తిని చాటుకున్నాడు. ఈ స్టేట్‌మెంట్‌తో ఫేక్ వార్తలు ప్రచారం చేసేవాళ్ల నోళ్లు మూతపడ్డాయని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com